




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 11 సంచిక : 229 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు శుక్రవారం 25 ఏప్రిల్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 229 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE FRI 25 APRIL 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada,Visakhapatnam, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur




## ప్రజా సేవల్లో హ్యూమానిటీ..

# పాలనలో ఏఐ


- ఏఐ, ఇతర ఎమర్జింగ్ టెక్నాలజీల ఆవశ్యకతపై ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు వర్క్‌షాప్
- వర్క్‌షాప్‌కు హాజరై ప్రారంభోపన్యాసం చేసిన సీఎం చంద్రబాబు
- ఏఐ, ఇతర ఎమర్జింగ్ టెక్నాలజీల ఆవశ్యకత, పాలనలో వాటి వినియోగంపై సీఎం మార్గనిర్దేశం
- ఈ వర్క్‌షాప్‌కు హాజరైన సీఎస్, డీజీపీ, వివిధ శాఖల అధికారులు

**పెన్ పవర్ డెస్క్:**'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అంశంపై సచివాలయంలో ఉన్నతాధికారులతో వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు హాజరై, ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఇతర ఎమర్జింగ్ టెక్నాలజీల ఆవశ్యకత, పాలనలో వాటి వినియోగంపైన ముఖ్యమంత్రి మార్గనిర్దేశం చేశారు. ఈ వర్క్‌షాప్‌కు సీఎస్, డీజీపీ, వివిధ శాఖల అధికారులు, కేంద్ర ఐటీ శాఖ మాజీ సెక్రటరీ చంద్రశేఖర్ హాజరయ్యారు. అలాగే వాద్వాని సెంటర్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ సీఈవో ప్రకాశ్ కుమార్, డబ్ల్యుజీడీటీ డీన్ కమల్ దాస్‌తో సహా పలువురు నిపుణులు కూడా వచ్చారు. గుడ్ గవర్నెన్స్ కోసం ఏఐ సహా నూతన టెక్నాలజీ వినియోగం, పౌర సేవల్లో మెరుగైన ఫలితాలు సాధించడంపై ప్రధానంగా చర్చ జరిగింది. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పౌర సేవల్లో టెక్నాలజీ వాడకం, ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలు, వచ్చే ఫలితాలపై కేస్ స్టడీస్ పరిశీలన జరిగింది. ఏయే విభాగాల్లో ఎటువంటి సాంకేతికను వినియోగించవచ్చు, ప్రస్తుతం ఉన్న సమాచారం ఆధారంగా సేవల్ని ఎలా విస్తృత పరచవచ్చు అనే దానిపై నిపుణులు ప్రజంటేషన్ ఇచ్చారు. ఏఐ, ఎంఎల్, డీఎల్, చాట్ జీపీటీ, జెమిని, డేటా డ్రివెన్, ఎవిడెన్స్ బేస్డ్ గవర్నెన్స్, ఏఐ ప్లేబుక్, ఏఐ బేస్డ్ పైలెట్ ఐడియాస్ వంటి అంశాలపై ప్రత్యేక సెషన్స్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయం, విద్య, వైద్య, పట్టణాభివృద్ధి సహా వివిధ రంగాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని పలువురు నిపుణులు వివరించనున్నారు. రెండు రోజుల పాటు కొనసాగనున్న వర్క్‌షాప్‌లో మొదటిరోజు కార్యదర్శులు, రెండోరోజు విభాగాధిపతులు హాజరుకానున్నారు.



# టెర్రరిస్టులపై యుద్ధం మొదలుపెడుతున్నాం

## ఫస్ట్ టైం ఇంగ్లీష్‌లో ప్రపంచానికి చెప్పిన మోదీ



- ఉగ్రవాదులకు ప్రధాని మోదీ స్ట్రాంగ్ వార్నింగ్
- పహల్గామ్‌లో ఉగ్రవాదుల పాశవిక దాడిపై నేరుగా స్పందించిన మోదీ
- బిహార్‌లో జరిగిన ఓ ప్రజా కార్యక్రమంలో మాట్లాడిన ప్రధాని
- ఉగ్రవాదులను వారు కలలో కూడా ఊహించని విధంగా శిక్షిస్తామని తీవ్ర హెచ్చరికలు

**పెన్ పవర్ డెస్క్:**జమ్మూకాశ్మీర్ లోని పహల్గాం ఉగ్రదాడిపై ప్రధాని మోదీ తీవ్రంగా స్పందించారు. ఉగ్రవాదులకు, వారిని ప్రోత్సహించేవారికి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ప్రతి టెర్రరిస్టును, వారికి మద్దతిచ్చే వారిని ఏ మూలన ఉన్నా వెతికి పట్టి శిక్షిస్తామని హెచ్చరించారు. బీహార్ లోని జరిగిన ఓ సభలో అంతర్జాతీయ సమాజాన్ని ఉద్దేశించి మొదటి సారి ఇంగ్లీషులో మాట్లాడిన ప్రధాని మోదీ..టెర్రరిస్టులను భారతదేశం భూభాగం చివరి వరకు వెంబడించి వేటాడుతామని ప్రతిజ్ఞ చేశారు. టెర్రరిస్టుదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి న్యాయం జరిగాలని దేశం మొత్తం ముక్తకంఠంతో ఉందని ప్రధాని అన్నారు. మానవత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ మాతో ఉన్నారు. మాతో నిలిచిన ప్రజలకు, ప్రపంచ దేశాల

వివరాలు 2లో..

## ఈ సస్పెన్షన్ తాత్కాలికమే...

# మళ్లీ వస్తా

- క్రమశిక్షణ పరమైన కారణాలతో దువ్వాడపై సస్పెన్షన్ వేటు
- ఇటీవలే సస్పెండ్ చేసిన వైసీపీ హైకమాండ్
- పార్టీ కోసం చాలా కష్టపడి పనిచేశానన్న దువ్వాడ
- రాజకీయ క్రీడలో బలైపోయానేమో అనిపిస్తోందని వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ను క్రమశిక్షణ పరమైన కారణాలతో వైసీపీ నుంచి సస్పెండ్ చేయడం తెలిసిందే. తన సస్పెన్షన్ పై దువ్వాడ శ్రీనివాస్ ఓ వీడియోలో స్పందించారు. ఈ నెల 22న వైసీపీ తనను సస్పెండ్ చేసిందని, ఆ మేరకు విడుదల చేసిన ప్రకటనపై తన అభిప్రాయం తెలియజేస్తున్నానని వెల్లడించారు.

వివరాలు 2లో..

## హిందువులను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకున్నారు:

# ఉగ్రదాడిపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ

- పహల్గాం ఉగ్రదాడిపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీవ్ర ఖండన
- ఈ దాడి పాకిస్తాన్ ప్రేరేపిత కుట్రగా ఆరోపణ, పిరికిపంద చర్యగా అభివర్ణన
- ఉద్రిక్తతలు రెచ్చగొట్టేందుకు హిందువులను లక్ష్యంగా చేసుకున్నారని వెల్లడి
- ఈ కవ్వింపు చర్య నేపథ్యంలో ప్రజలు సంయమనం, ఐక్యత పాటించాలని విజ్ఞప్తి
- అధికారిక తీర్మానం ద్వారా తమ అభిప్రాయాన్ని వెల్లడించిన సీడబ్ల్యూసీ

**పెన్ పవర్ డెస్క్:**పహల్గాంలో ఇటీవల చోటుచేసుకున్న ఉగ్ర వాద దాడిని కాంగ్రెస్ పార్టీ అత్యున్నత ని ర్ణాయక మండలి అయిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) తీవ్రంగా ఖండించింది. ఈ దాడిని పాకిస్తాన్ ప్రేరేపితమైన 'పిరిక ిపంద చర్య'గా అభివర్ణిస్తూ, దీని వెనుక ఇ స్లామాబాద్

వివరాలు 2లో..




## నిఘా వ్యవస్థ బీజేపీ కోసమే పనిచేస్తోంది...

# పహల్గామ్ దాడి కేంద్రం వైఫల్యమే

- పహల్గామ్ లో ఉగ్రదాడి
- తీవ్రంగా స్పందించిన షర్మిల
- కశ్మీర్ వంటి సున్నితమైన ప్రాంతంలో భద్రతా లోపం ఎందుకు తలెత్తిందని ఆగ్రహం
- మోదీ, అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్



**పెన్ పవర్ డెస్క్:**జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో యాత్రికులపై జరిగిన ఉగ్రదాడి ఘటనపై వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు. ఇది ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వ భద్రతా వైఫల్యమేనని ఆమె ఆరోపించారు. ఈ దాడికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తమ పదవులకు రాజీనామా చేయాలని

వివరాలు 2లో..

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో అమిత్ షా, జైశంకర్ కీలక భేటీ

- పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాక్ సంబంధాలు తీవ్ర ఉద్రిక్తం
- సింధు జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు, పాక్ పౌరులకు వీసాలు నిలిపివేత
- ప్రతిగా భారత విమానాలకు పాక్ గగనతలం మూసివేత
- రాష్ట్రపతి ముర్ముతో హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి జైశంకర్ భేటీ
- G20 దేశాల రాయబారులతో భారత విదేశాంగ శాఖ సంప్రదింపులు



**పెన్ పవర్ డెస్క్:**భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కేంద్ర మంత్రులు అమిత్ షా, జైశంకర్ కలిశారు. పహల్గాం ఉగ్రదాడి, భారత్ చర్యల నేపథ్యంలో రాష్ట్రపతితో భేటీ అయిన కేంద్ర మంత్రులు దేశభద్రత, పాక్ దౌత్యపరమైన

వివరాలు 2లో..

## కూటమి ప్రభుత్వ అప్పులు, సంపద సృష్టిలో స్పష్టత కొరవడిందన్న బుగ్గన

- చంద్రబాబు అనుభవం దృష్ట్యా ప్రజలు నమ్మకం ఉంచారని వ్యాఖ్య
- క్షేత్ర స్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని మండిపాటు

వివరాలు 2లో..




**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత కూటమి ప్రభుత్వం సంపద సృష్టిలో వెనుకబడి, అప్పులు చేయడంలో మాత్రం ముందుందని వైసీపీ సీనియర్ నేత, రాష్ట్ర మాజీ ఆర్థిక

# ఢీ అంటే ఢీ:

## భారత్‌కు పాక్ కౌంటర్ చర్యలు


- పహల్గామ్ దాడి నేపథ్యంలో భారత్ చర్యలకు పాక్ ప్రతిచర్య
- సింధూ జల ఒప్పందాన్ని నిలిపివేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన పాక్
- నీటిని ఆపితే యుద్ధంగా పరిగణిస్తామని హెచ్చరిక
- భారత్‌తో సిమ్లా సహా అన్ని ద్వైపాక్షిక ఒప్పందాల తాత్కాలిక నిలిపివేత
- భారత విమానాలకు గగనతలం మూసివేత, వాణిజ్యంపై నిషేధం
- దౌత్య సిబ్బంది తగ్గింపు, వీసాల రద్దు వంటి ప్రతీకార నిర్ణయాలు

వివరాలు 2లో..



## ఎర్రబెల్లి దయాకరరావుకు షాక్.. కాంగ్రెస్‌లో చేరిన సన్నిహితుడు!

- కాంగ్రెస్‌లో చేరిన సోమేశ్వరరావు, పలువురు మాజీ సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి




**పెన్ పవర్ డెస్క్:**బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర రావుకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్య బీఆర్ఎస్ నాయకులు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

వివరాలు 2లో..

## ఉగ్ర ముప్పు హెచ్చరికలు...

# తిరుమలలో హై అలర్ట్

- పహల్గాం ఉగ్రదాడితో తిరుమలలో అప్రమత్తత
- కేంద్ర నిఘా సంస్థల హెచ్చరికలతో భద్రత పెంపు
- అలిపిరి, ఘాట్ రోడ్లలో వాహనాల క్షుణ్ణ తనిఖీలు
- పోలీసు, విజిలెన్స్, ఆక్టోపస్ బలగాలతో మాక్ డ్రిల్
- ఆలయ పరిసరాల్లో అదనపు బలగాలతో నిరంతర నిఘా



వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

### బాలినేని ఒంటరివాడయినట్లేనా? ఎవరూ రాకపోవడానికి రీజన్ ఇదేనా?

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డి వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరిపోయారు. అయితే తనకు పట్టున్న ఒంగోలు కార్పొరేషన్ కు చెందిన కార్పొరేటర్లను అయితే తనతో పాటు జనసేనలోకి తీసుకు వచ్చారు. అయితే మరికొందరు కీలక నేతలను పార్టీలోకి తీసుకు రావాలన్న ఆయన ఆలోచన మాత్రం కార్యరూపం దాల్చడం లేదని తెలిసింది. ప్రస్తుత పరిస్థితుల్లో జనసేనలోకి వచ్చేందుకు ఎవరూ పెద్దగా సుముఖత వ్యక్తం చేయడం లేదని సమాచారం. అందుకే బాలినేని శ్రీనివాసులు రెడ్డి ఎంతగా ప్రయత్నించినా కొందరు నేతలు సున్నితంగా తిరస్కరిస్తుండగా, మరికొందరు నేతలు మాత్రం తాము వైసీపీని వదిలి రాలేమని తెగేసి చెబుతున్నారు.

**జిల్లాపై పట్టున్న నేతగా...**

బాలినేని శ్రీనివాసులు రెడ్డి కాంగ్రెస్ లో ఉన్నప్పటి నుంచే ప్రకాశం జిల్లాను తన చెప్పు చేతల్లో పెట్టుకుని ఉన్నారు. నాడు పీసీసీ చీఫ్ గా, తర్వాత ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డికి సమీప బంధువు కావడంతో ఆయన చెప్పిందే మాట.. చేసిందే శాసనం అన్నట్లు ఉండేది. నాటి నుంచి 2019 ఎన్నికల వరకూ బాలినేని శ్రీనివాసులు రెడ్డి చెప్పిన వారికే టిక్కెట్లు దక్కేవి. అందుకే బాలినేని అందరు నేతలతో టచ్ లో ఉంటారు. వారు కూడా బాలినేని ప్రాపకం కోసం పాకులాడేవారు. అలాంటిది 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత బాలినేని వైసీపీకి రాజీనామా చేయడం, తర్వాత జనసేనలో చేరిపోవడం ఒకరకంగా మిగిలిన నేతలకు కూడా షాకింగ్ కు గురి చేశాయి.

**బాలినేని వెంట..?**

కానీ బాలినేని శ్రీనివాసులు రెడ్డి పార్టీని వీడితే అనేక మంది నేతలు కూడా ఆయన వెంట పోలోమంటూ క్యూ కడతారని భావించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా అదే ఊహించారు. అందుకే బాలినేనికి అంత ప్రాధాన్యత ఇచ్చారు. కానీ బాలినేని చేరి నెలలు కావస్తున్నా ఒక్క పేరున్న నేత కూడా ప్రకాశం జిల్లా నుంచి రాకపోవడం జనసేనలోనూ చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న పరిణామాలు, హామీలు అమలు చేయకపోవడం, తిరిగి జగన్ పుంజుకునే అవకాశాలుంటాయన్న అంచనాలు వినపడుతుండటంతో నేతలు పార్టీని వీడి వచ్చేందుకు సుముఖంగా లేరని చెబుతున్నారు. బాలినేని వదలకుండా ప్రయత్నిస్తున్నా కార్పొరేటర్లు మినహా మరో ముఖ్యనేత ప్రకాశం జిల్లాలో ఆయన వెంట రాకపోవడానికి ఇదే కారణమని అంటున్నారు.

**మానుగుంట కూడా...**

తాజాగా మరో ముఖ్యమైన వార్త వినపడుతుంది. కందుకూరు మాజీ శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి కూడా జనసేనలో చేరతారన్న ప్రచారం జరుగుతుంది. కానీ ఆయనతో బాలినేని మాట్లాడారని, త్వరలోనే జనసేన గూటికి వస్తారన్న క్యాంపెయిన్ సోషల్ మీడియాలో పెద్దయెత్తున నడిచింది. జగన్ వైఖరితో కలత చెంది తీవ్ర అవమానభారంతో వైసీపీని మానుగుంట మహీధర్ రెడ్డి వీడతారన్న ప్రచారంలో మాత్రం నిజం లేదని అంటున్నారు. ఆయన కూడా బాలినేని సంప్రదించినా వెనక్కు తగ్గినట్లు తెలిసింది. దీంతో బాలినేని శ్రీనివాసులు రెడ్డి తాను ఊహించినట్లు.. అనుకున్నట్లు ఎవరూ తన వెంట రాకపోయేసరికి డీలా పడినట్లు బాలినేని సన్నిహితులు చెబుతున్నారు.

# టెర్రరిస్టులపై యుద్ధం మొదలుపెడుతున్నాం

- మొదటి పేజీ తరువాయి

నేతలకు నా కృతజ్ఞతలు అని అన్నారు. ప్రధాని మోదీ మొదటి సారి ఇంగ్లీషులో మాట్లాడటం సోషల్ మీడియాలో నెటిజన్లు హైలైట్ చేశారు. మోదీ ఇంగ్లీష్ మాట్లాడటం ద్వారా అంతర్జాతీయ లాబీతో పాటు ఉగ్రవాదులను స్పాన్సర్ చేస్తున్న వారికి ప్రత్యక్ష సందేశం అని అంటున్నారు. ఉగ్రవాదానికి, దానిని ప్రోత్సహిస్తున్న వారికి ఇది గట్టి హెచ్చరిక అని ప్రతికార చర్యలు గట్టిగానే ఉంటాయని నెటిజన్లు సోషల్ మీడియాలో ప్లాట్ ఫాంలో కామెంట్స్ చేస్తున్నారు. పహల్గామ్ ఉగ్రవాద దాడిని ప్రపంచదేశాలు ఖండించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండించారు. భారతదేశంతో సంఘీభావం తెలిపారు. పహల్గాం ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండిస్తూ హేయమైన దాడికి పాల్పడిన వారిని న్యాయం ముందు నిలబెట్టేందుకు భారతదేశానికి ట్రంప్ పూర్తి మద్దతు ప్రకటించారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో అమాయక పౌరులపై జరిగిన పాశవిక ఉగ్రదాడి ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా స్పందించారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన ఉగ్రవాదులకు, వారి వెనుక ఉన్న శక్తులకు ఊహకు కూడా అందని రీతిలో కఠిన శిక్ష తప్పదని ఆయన గట్టిగా హెచ్చరించారు. బిహార్‌లో జరిగిన ఓ బహిరంగ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ప్రధాని మోదీ పహల్గామ్ ఉగ్రదాడి ఘటనపై తొలిసారిగా నేరుగా స్పందించి, కీలక వ్యాఖ్యలు చేశారు.

పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన దాడిని కేవలం కొందరు వ్యక్తులపై జరిగిన దాడిగా కాకుండా, యావత్ భారతదేశంపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. "ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదులకు, దీని వెనుక కుట్ర పన్నిన వారికి వారి ఊహకు కూడా అందని శిక్ష పడుతుంది. శిక్ష పడి తీరుతుంది. ఉగ్రవాదుల మిగిలిన మూలాలను కూడా మట్టిలో కలిపే సమయం ఆసన్నమైంది," అని ఆయన ఉద్ఘాటించారు. అమాయక ప్రజలను అతి కిరాతకంగా చంపిన ముష్కరులు ఎక్కడున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వారిని శిక్షించి తీరుతామని అన్నారు. 140 కోట్ల మంది భారతీయుల సమిష్టి సంకల్ప శక్తి ఉగ్రవాదుల వెన్ను విరుస్తుందని ప్రధాని ధీమా వ్యక్తం చేశారు.

ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా నిలుస్తుందని ప్రధాని మోదీ భరోసా ఇచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతి భారతీయుడిలో ఈ దాడి పట్ల తీవ్ర బాధ, ఆగ్రహం వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు భారతదేశం దృఢ సంకల్పంతో ఉందని, ఉగ్రవాద చర్యల ద్వారా

దేశ ఐక్యతా స్ఫూర్తిని దెబ్బతీయలేరని ఆయన అన్నారు. ఉగ్రదాడిని ఖండిస్తూ, భారత్‌కు అండగా నిలిచిన అంతర్జాతీయ సమాజానికి, వివిధ దేశాల నాయకులకు ప్రధానమంత్రి మోదీ కృతజ్ఞతలు తెలిపారు. మానవత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ ఈ క్లిష్ట సమయంలో భారత్‌కు మద్దతుగా నిలిచారని ఆయన పేర్కొన్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో భారత్ వెనకడుగు వేయదని, న్యాయం జరిగేలా చూస్తామని ప్రపంచానికి సందేశం ఇచ్చారు. "భారతదేశం ప్రతి ఉగ్రవాదిని, వారి మద్దతుదారులను గుర్తించి, వెంటాడి శిక్షిస్తుంది," అని బిహార్ వేదికగా ప్రధాని స్పష్టం చేశారు.

అంతకుముందు, బిహార్‌లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ, దేశ వేగవంతమైన అభివృద్ధికి శాంతిభద్రతలు అత్యంత కీలకమని ప్రధాని నొక్కి చెప్పారు. 'వికసిత భారత్' లక్ష్య సాధనకు 'వికసిత బిహార్' నిర్మాణం ఎంతో ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఈ సస్పెన్షన్ తాత్కాలికమే... మళ్లీ వస్తా

- మొదటి పేజీ తరువాయి

"వైసీపీ గురించి మాట్లాడుకునే ముందు జగన్ గారి గురించి మాట్లాడుకోవాలి. నాకు ఈ స్థాయిని, హోదాను ఇచ్చింది జగనే... అందుకు గాను ఆయనకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. పార్టీ కోసం నేను చాలా కష్టపడి పనిచేశాను... పార్టీకి గొంతుకలా మారాను... నాడు ప్రతిపక్షాల మీద గట్టిగా విరుచుకుపడ్డాను. ఎంతో కష్టపడి పనిచేసిన నన్ను... అకారణంగా, వ్యక్తిగత కారణాలు అనే కారణంతో సస్పెండ్ చేశారని తెలిసింది. నా హృదయంలో జగన్ మోహన్ రెడ్డి గారు ఎప్పటికీ నిలిచి ఉంటారు. అయితే, రాజకీయ క్రీడలో నేను బలయ్యానేమో అనిపిస్తోంది. పాతికేళ్లుగా ప్రజా జీవితంలో ఉంటూ, ప్రజాసేవనే పరమావధిగా భావించిన నేను ఎప్పుడూ పార్టీకి ద్రోహం చేయలేదు, అవినీతి చేయలేదు, లంచాలు తీసుకోలేదు, అధికార దుర్వినియోగానికి పాల్పడలేదు, భూకబ్జాలు చేయలేదు... పార్టీ కోసమే అహర్నిశలు పనిచేశాను. తాజాగా జరిగిన పరిణామాన్ని స్వీకరిస్తున్నాను. సస్పెన్షన్ అంటే తాత్కాలిక విరామం అని అర్థం. ఈ తాత్కాలిక విరామాన్ని ప్రకటించినప్పుడు నాకొకటి గుర్తొస్తోంది. గురజాడ అప్పారావు గారు ఓ మాట చెప్పారు... విజయం కోసం విసుగును వీడి విరామమెరుగక పనిచేయండోయ్ అన్నారు... నేను కూడా ఆ విధంగానే విరామం లేకుండా పనిచేస్తాను... కష్టపడి పనిచేస్తాను... స్వతంత్రుడిగా, తటస్థుడిగా, నన్ను నమ్ముకున్న ప్రజల కోసం, నా గ్రామాల కోసం, నాపై ఆధారపడి ఉన్న కార్యకర్తల కోసం, అభిమానుల కోసం నిరంతరం మరింత రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తాను... ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. గ్రామగ్రామాల్లో ఇంటింటికీ ఈ దువ్వాడ శ్రీనివాస్ మళ్లీ వస్తాడు... అన్నింటికీ కాలమే తీర్పు చెబుతుంది. నాకు ఇంతటి గౌరవాన్ని ఇచ్చిన టెక్కలి నియోజకవర్గ ప్రజలను ఎప్పటికీ మర్చిపోను. నా ఊపిరి ఉన్నంత వరకు వారి సేవలోనే నిమగ్నమై ఉంటాను. నా సేవలు ఎక్కడ అవసరమైతే అక్కడ నేను ప్రత్యక్షంగా ఉపయోగపడతాను. ఇప్పటివరకు అవకాశం ఇచ్చిన వైసీపీ అధినేత జగన్ కు నా హృదయపూర్వక నమస్కారాలు" అంటూ దువ్వాడ శ్రీనివాస్ తన వీడియోలో పేర్కొన్నారు.

## హిందువులను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకున్నారు: ఉగ్రదాడిపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ

- మొదటి పేజీ తరువాయి

హస్తం ఉందని ఆరోపించింది. గురువారం నాడు సీడబ్ల్యూసీ ఒక అధికారిక తీర్మానాన్ని ఆమోదించింది. పహల్గాంలో జరిగిన హేయమైన ఉగ్రదాడి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నట్లు అందులో పేర్కొంది. "పహల్గాంలో జరిగిన ఈ పిరికిపంద ఉగ్రదాడికి పాకిస్తానే సూత్రధారి" అని తన తీర్మానంలో స్పష్టం చేసింది. దేశంలో ఉద్రిక్త పరిస్థితులను సృష్టించేందుకే హిందూ యాత్రికులను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకున్నారని సీడబ్ల్యూసీ ఆందోళన వ్యక్తం చేసింది. "దేశవ్యాప్తంగా ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకే హిందువులను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకున్నారు. ఈ తీవ్రమైన కవ్వింపు చర్య నేపథ్యంలో అందరూ సంయమనం పాటించాలని మేము విజ్ఞప్తి చేస్తున్నాం" అని తన ప్రకటనలో కోరింది. సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, ప్రజలందరూ ఐక్యంగా ఉండాలని, శాంతియుత వాతావరణాన్ని కొనసాగించాలని పార్టీ విజ్ఞప్తి చేసింది.

## ఢీ అంటే ఢీ: భారత్‌కు పాక్ కౌంటర్ చర్యలు

**పెన్ పవర్ డెస్క్:** జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ తీసుకున్న కఠిన దౌత్యపరమైన చర్యలకు ప్రతిగా పాకిస్తాన్ కూడా తీవ్రంగా స్పందించింది. సిమ్లా ఒప్పందంతో సహా భారత్‌తో ఉన్న అన్ని ద్వైపాక్షిక ఒప్పందాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు గురువారం ప్రకటించింది. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన జరిగిన జాతీయ భద్రతా కమిటీ సమావేశం అనంతరం ఈ కీలక నిర్ణయాలు వెలువడ్డాయి. సింధూ నదీ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడాన్ని పాకిస్తాన్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఒప్పందం ప్రకారం తమకు రావాల్సిన నీటి ప్రవాహాన్ని ఆపడానికి లేదా దారి మళ్లించడానికి ప్రయత్నిస్తే, దానిని 'యుద్ధ చర్య'గా పరిగణిస్తామని పాక్ ప్రధాని కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో హెచ్చరించింది. తమ జాతీయ శక్తి సామర్థ్యాల మేరకు పూర్తిస్థాయిలో ప్రతిస్పందిస్తామని స్పష్టం చేసింది.

అంతేకాకుండా, భారత్‌కు చెందిన లేదా భారత్ ద్వారా నడిచే అన్ని విమానాలకు తక్షణమే తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు పాకిస్తాన్ ప్రకటించింది. భారత్‌తో అన్ని రకాల వాణిజ్యాన్ని, పాకిస్తాన్ మీదుగా ఇతర దేశాలకు జరిగే వాణిజ్యాన్ని కూడా తక్షణమే నిలిపివేస్తున్నట్లు తెలిపింది. భారత్ చర్యలకు బదులుగా వాఘా సరిహద్దు పోస్టును మూసివేయడంతో పాటు, ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్‌లోని సిబ్బంది సంఖ్యను 30కి తగ్గించాలని,

ఇక్కడి భారత రక్షణ శాఖ అధికారులను బహిష్కరించాలని కూడా పాకిస్తాన్ నిర్ణయించింది.

నిన్న భారత్ తీసుకున్న చర్యలకు ప్రతిగానే పాకిస్తాన్ ఈ నిర్ణయాలు తీసుకుంది. సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం, దౌత్య సంబంధాలను తగ్గించడం, పాక్ దౌత్యవేత్తలను, రక్షణ శాఖ అధికారులను బహిష్కరించడం, పాక్ పౌరులకు వీసాలు రద్దు చేసి 48 గంటల్లో దేశం విడిచి వెళ్లాలని ఆదేశించడం, అటారీ-వాఘా సరిహద్దును మూసివేయడం వంటి చర్యలను భారత్ చేపట్టిన సంగతి తెలిసిందే.

ఈ నేపథ్యంలో, పాకిస్తాన్‌లో ఉగ్రవాదాన్ని ప్రేరేపించడం, సరిహద్దుల ఆవల హత్యలు, అంతర్జాతీయ చట్టాలను, కాశ్మీర్‌పై ఐక్యరాజ్యసమితి తీర్మానాలను భారత్ పాటించడం లేదని ఆరోపిస్తూ, ఈ పరిస్థితులు చక్కబడే వరకు ఒప్పందాలను నిలిపివేస్తున్నట్లు పాకిస్తాన్ పేర్కొంది.

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో అమిత్ షా, జైశంకర్ కీలక భేటీ

- మొదటి పేజీ తరువాయి

చర్యలపై కీలక చర్చలు జరిపారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన దారుణ ఉగ్రదాడి ఘటన భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య సంబంధాలను తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల్లోకి నెట్టింది. ఈ దాడిలో 26 మంది అమాయక భారతీయులను ఉగ్రవాదులు బలిగొన్న ఘటనపై భారత ప్రభుత్వం అత్యంత తీవ్రంగా స్పందించింది. దీనికి ప్రతిస్పందనగా పాకిస్థాన్‌తో కీలకమైన సింధు నదీ జలాల ఒప్పందాన్ని తక్షణమే నిలిపివేస్తున్నట్లు బుధవారం ప్రకటించిన కేంద్రం, పాకిస్థాన్ జాతీయులకు అన్ని రకాల వీసాలను రద్దు చేస్తున్నట్లు గురువారం వెల్లడించింది. భారత్ తీసుకున్న ఈ కఠిన నిర్ణయాలకు పాకిస్థాన్ కూడా ప్రతిచర్యలకు దిగింది. భారత విమానాలు తమ గగనతలం గుండా ప్రయాణించకుండా నిషేధం విధించింది. ఇరు దేశాలు తీసుకుంటున్న ఈ నిర్ణయాలతో సరిహద్దుల్లోనూ, దౌత్యపరంగానూ ఆందోళనకర వాతావరణం నెలకొంది. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భేటీ అయ్యారు. పహల్గాం ఉగ్రదాడి ఘటన, అనంతర పరిణామాలు, ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి రాష్ట్రపతికి వివరించినట్లు తెలుస్తోంది. ఈ భేటీకి సంబంధించిన చిత్రాన్ని రాష్ట్రపతి భవన్ అధికారిక 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు.

**దౌత్యపరమైన చర్యలు**

మరోవైపు, పహల్గాం ఉగ్రదాడి ఘటనపై అంతర్జాతీయ సమాజానికి వివరించే ప్రయత్నాల్లో భాగంగా భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగింది. చైనా, కెనడా సహా పలు జీ20 దేశాలకు చెందిన రాయబారులతో విదేశాంగ శాఖ అధికారులు సమావేశమయ్యారు. దాదాపు అరగంట పాటు ఈ సమావేశం జరిగినట్లు సమాచారం. ఈ భేటీలో ఉగ్రదాడికి సంబంధించిన వివరాలు, పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదం గురించి వివరించినట్లు తెలుస్తోంది.

## కూటమి ప్రభుత్వ అప్పులు, సంపద సృష్టిలో స్పష్టత కొరవడిందన్న బుగ్గన

- మొదటి పేజీ తరువాయి

శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఆర్థిక పరిస్థితి మెరుగుపడలేదని, అప్పులు, సంపద సృష్టి విషయంలో స్పష్టత కొరవడిందని అన్నారు. ప్రభుత్వ అప్పుల లెక్కలపై ప్రజల్లో గందరగోళం నెలకొందని బుగ్గన పేర్కొన్నారు. అప్పుల గణాంకాలను కొందరు 'మట్కా లెక్కల' మాదిరిగా చెబుతున్నారని ప్రజలు అనుకుంటున్నారని ఆయన వ్యాఖ్యానించారు. సంపద సృష్టిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వంపై ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం దృష్ట్యా నమ్మకం ఉంచారని, కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని ఆయన అన్నారు. కేంద్రంలో మద్దతు ఉందని చెప్పుకుంటున్నా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిలో ఎటువంటి సానుకూల మార్పు కనిపించడం లేదని ఆయన ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్ర పన్నుల ఆదాయం రూ. 81,400 కోట్లుగా ఉందని బుగ్గన గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ ఆదాయం, తమ హయాంతో పోలిస్తే 7.5 శాతం తక్కువగా ఉందని, సంపద సృష్టి తగ్గిపోయిందని ఆయన ఆరోపించారు. "సంపద సృష్టి తక్కువ.. అప్పులు ఎక్కువ.. ఇదే కూటమి ప్రభుత్వ పనితీరు" అని ఆయన ఎద్దేవా చేశారు.

తాము సామాన్య ప్రజల సంక్షేమం కోసం పాలన సాగించామని, వైసీపీ అప్పులు చేసిందని విమర్శించే కూటమి ప్రభుత్వం, అంతకంటే ఎక్కువ అప్పులు చేసి ఆ నిధులను ఎవరికి పంచుతోందని ఆయన నిలదీశారు. జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అమలైన పథకాలు ప్రస్తుతం ప్రజలకు అందడం లేదని బుగ్గన ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో, కూటమి ప్రభుత్వం ఇస్తామన్న హామీలు, పథకాలు కూడా కార్యరూపం దాల్చడం లేదని విమర్శించారు. మరి ఈ పరిస్థితుల్లో రాష్ట్ర సంపద అంతా ఎక్కడికి వెళుతోందని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.

## ఎర్రబెల్లి దయాకరరావుకు షాక్.. కాంగ్రెస్‌లో చేరిన సన్నిహితుడు!

- మొదటి పేజీ తరువాయి

సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో ఎర్రబెల్లి దయాకర రావు సన్నిహితుడు సోమేశ్వర రావు, పలువురు మాజీ సర్పంచ్‌లు, జెడ్పీటీసీ సభ్యులు ఉన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్ర ముప్పు హెచ్చరికలు... తిరుమలలో హై అలర్ట్

**పెన్ పవర్ డెస్క్:** జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో, ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన తిరుమలలో భద్రతను అత్యంత కట్టుదిట్టం చేశారు. ఉగ్రవాదుల నుంచి ముప్పు పొంచి ఉందన్న కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికల మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు, భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల భద్రతకు ఎలాంటి లోపం రాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టారు. తిరుమలకు ప్రధాన ప్రవేశ మార్గమైన అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద భద్రతను గణనీయంగా పెంచారు. అలిపిరి నుంచి తిరుమలకు వెళ్లే ఘాట్ రోడ్లపై ప్రయాణించే వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులు, ప్రైవేటు వాహనాలతో పాటు, భక్తులు తీసుకువచ్చే లగేజీని కూడా భద్రతా సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఘాట్ రోడ్డు మధ్యలో కూడా తనిఖీలు నిర్వహిస్తూ, అనుమానాస్పద కదలికలపై నిఘా ఉంచారు. అవాంఛనీయ సంఘటనలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సంసిద్ధతలో భాగంగా పోలీసు, టీటీడీ విజిలెన్స్, ప్రత్యేక ఆక్టోపస్ బలగాలు సంయుక్తంగా ఒక మాక్ డ్రిల్‌ను నిర్వహించాయి. అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, భక్తులను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి అనే అంశాలపై ఈ డ్రిల్ సాగింది. శ్రీవారి ఆలయ పరిసర ప్రాంతాల్లో కూడా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఆలయ మాడ వీధులు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ పరిసరాలు, ఇతర ముఖ్యమైన ప్రాంతాల్లో అదనపు భద్రతా సిబ్బందిని మోహరించారు. 24 గంటల పాటు నిరంతర నిఘా కొనసాగిస్తూ, భక్తులు ప్రశాంతంగా, ఎటువంటి ఆటంకాలు లేకుండా శ్రీవారిని దర్శించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు వారు స్పష్టం చేశారు.

## నిఘా వ్యవస్థ బీజేపీ కోసమే పనిచేస్తోంది... పహల్గామ్ దాడి కేంద్రం వైఫల్యమే

- మొదటి పేజీ తరువాయి

ఆమె డిమాండ్ చేశారు. దేశ భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దేశంలో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయని ప్రధాని మోదీ విస్తృతంగా ప్రచారం చేసుకున్నారని, పెద్ద పెద్ద హోర్డింగులు ఏర్పాటు చేశారని షర్మిల గుర్తుచేశారు. ఏటా కోట్లాది మంది పర్యాటకులు సందర్శించే కశ్మీర్ వంటి సున్నితమైన ప్రాంతంలో భద్రతా లోపం ఎందుకు తలెత్తిందని ఆమె ప్రశ్నించారు. "పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరుపుతుంటే అక్కడ కనీస భద్రతా సిబ్బంది లేకపోవడం దారుణం. ఇది కచ్చితంగా ప్రభుత్వ వైఫల్యమే. ఇంతమంది ప్రాణాలు కోల్పోవడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం" అని షర్మిల పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని నియంత్రించాల్సిన బాధ్యత బీజేపీ ప్రభుత్వంపై ఉందని, 'చౌకీదార్' అని చెప్పుకునే మోదీ పాలనలో ఇదేనా భద్రత కల్పించే తీరు అని ఆమె నిలదీశారు. ఈ ఘటన స్పష్టంగా నిఘా వైఫల్యమని, దేశ నిఘా వ్యవస్థలు దేశం కోసం కాకుండా, బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారిపైనే దృష్టి సారిస్తున్నాయని ఆమె ఆరోపించారు. "దేశ దర్యాప్తు, నిఘా వ్యవస్థలను సొంత రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నారు. నిఘా వర్గాల బలం అంతా ప్రధాని మోదీ కోసం పనిచేస్తోంది తప్ప, దేశ భద్రత కోసం కాదు" అని షర్మిల విమర్శించారు. ఇంత ఘోరంగా భద్రతా వ్యవస్థలు విఫలమైన ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే హక్కు లేదని షర్మిల అన్నారు. వీరు దేశానికి కాదు, బీజేపీకి చౌకీదార్లని ఆమె వ్యాఖ్యానించారు.

పెన్ పవర్
ప్రకాశం




## టెన్త్ పరీక్ష ఫలితాల్లో సత్తా చాటిన ప్రైవేటు పాఠశాలలు


# చతికిలబడ్డ ప్రభుత్వ పాఠశాలలు




**ప్రైవేటు పాఠశాలల్లో అత్యధిక పర్సంటేజ్ సాధించిన సర్వైట్ పాఠశాల.**
**ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక పర్సంటేజ్ పొందిన తాటిచెర్ల మోటు జిల్లా పరిషత్ హై స్కూల్.**
**ప్రభుత్వ పాఠశాలల్లో అత్యల్ప పర్సంటేజ్ పొందిన రాజుపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్.**
**ప్రైవేటు పాఠశాలల్లో అత్యల్ప పర్సంటేజ్ పొందిన గోపానిపల్లె ఏబీఎం పాఠశాల.**

**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 24.**

పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలలో ఈ ఏడాది కొమరోలు మండలంలోని ప్రైవేట్ పాఠశాలలు సత్తా చాటాయి. అయితే ప్రభుత్వ పాఠశాలలు దాదాపుగా అన్ని పాఠశాలలు చతికిలబడ్డాయి. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు కొమరోలు లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి144 మంది విద్యార్థులు, తాటిచెర్ల మోటు లోని జిల్లా పరిషత్ హై స్కూల్ నుంచి 38 మంది విద్యార్థులు, అల్లినగరంలోని మునగనూరి వెంకటసుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ హై స్కూల్ నుంచి 30 మంది విద్యార్థులు, రాజుపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ నుంచి 38 మంది విద్యార్థులు, రాజుపాలెం లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నుంచి 32 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వారితోపాటు గోపానిపల్లిలోని ఏబీఎం హై స్కూల్ నుంచి ఒక విద్యార్థి ,కొమరోలు లోని ఎస్ బి ఎన్ ఆర్ ఎం హై స్కూల్ నుంచి 103 మంది విద్యార్థులు, తాటిచెర్ల మోటు లోని బాల యేసు హై స్కూల్ నుంచి 14 మంది విద్యార్థులు, కొమరోలు లోని నరేష్ రెడ్డి హై స్కూల్ నుంచి 15 మంది విద్యార్థులు, కొమరోలు లోని సర్వైట్ హై స్కూల్ నుంచి 33 మంది విద్యార్థులు మొత్తం 448 మంది విద్యార్థులు టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యారు. అయితే పరీక్షా ఫలితాలు బుధవారం వెలడయ్యాయి .వాటిల్లో ప్రైవేట్ పాఠశాలలు తమ సత్తా చాటి అత్యధిక పర్సంటేజీలు కైవసం చేసుకున్నాయి .ఇక ప్రైవేట్ పాఠశాలలు పూర్తిగా చతికిలబడి తక్కువ పర్సంటేజ్ తో సరిపెట్టుకోవలసి వచ్చింది. కొమరోలు లోని సర్వైట్ హై స్కూల్ నుంచి 33 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 32 మంది ఉత్తీర్ణులయ్యారు, దీనితో ఆ పాఠశాలకు 97% ఉత్తీర్ణత లభించి మండలంలో మొదటి స్థానంలో నిలిచింది. అంతేగాక ఆ పాఠశాలకు చెందిన కే హర్షిత 600 మార్కులకు581 మార్కులు సాధించి మండల టాపర్గా నిలిచింది. కొమరోలు లోని నరేష్ రెడ్డి హై స్కూల్ నుంచి 15మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా వారిలో 14 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై ఆ పాఠశాలకు 93% ఉత్తీర్ణత సాధించిపెట్టారు. కొమరోలు లోని ఎస్బిఎన్ఆర్ఎం హైస్కూల్ నుంచి 103 మంది విద్యార్థులు పరీక్షలు హాజరుకాగా, వారిలో 87 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు దీనితో ఆ పాఠశాలకు 84% ఉత్తీర్ణత లభించింది. తాటిచెర్ల మోటు లోని బాల యేసు హై స్కూల్ నుంచి 14 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వారిలో 9 మంది ఉత్తీర్ణులయ్యారు దీనితో ఆ పాఠశాలకు 63 శాతం ఉత్తీర్ణత లభించింది. గోపాని పల్లి లోని ఏబీఎం పాఠశాల నుంచి ఒక విద్యార్థి హాజరుకాగా ,ఆ విద్యార్థి కూడా ఫెయిల్ కావడంతో ఆ పాఠశాలకు 0% ఉత్తీర్ణత లభించింది. ఇక ప్రభుత్వ పాఠశాలలుగా పేరుపొందిన కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్ నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు 144 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 56 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు, దీనితో ఆ పాఠశాలకు కేవలం 39 శాతం మాత్రమే ఉత్తీర్ణత లభించింది. తాటిచెర్ల మోటు లోని జిల్లా పరిషత్ హై స్కూల్ నుంచి 38 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వారు 27 మంది విద్యార్థులు హాజరయ్యారు దీనితో ఆ పాఠశాలకు 71% ఉత్తీర్ణత లభించింది. అల్లినగరంలోని ఎంవీఎస్ జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి 30 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో పదిమంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. దీనితో ఆ పాఠశాలకు 33% ఉత్తీర్ణత లభించింది. రాజుపాలెం లోని జిల్లా పరిషత్ హై స్కూల్ నుంచి 38 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వారిలో 12 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు .దీనితో ఆ పాఠశాలకు 32 శాతం ఉత్తీర్ణత లభించింది. రాజుపాలెం లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నుంచి 32 మంది బాలికలు పరీక్షలకు హాజరుకాగా వారిలో 20 మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు దీనితో ఆ విద్యాలయానికి 63% ఉత్తీర్ణత లభించింది. ఇక కొమరోలు లోని సర్వైట్ హైస్కూల్ విద్యార్థిని కే హర్షిత 600కు 581 మార్కులు సాధించి మండల టాపర్గా నిలువగా, . కొమరోలు లోని ఎస్బిఎన్ఆర్ఎం హైస్కూల్ విద్యార్థిని ఎస్.కె తహసీన్ 575 మార్కులు సాధించి మండలంలో రెండవ టాపర్గా నిలువగా ,అదే పాఠశాలకు చెందిన బి వసంత కుమార్ 574 మార్కులు సాధించి మూడవ టాపర్గా ,అదే పాఠశాలకు చెందిన ఎస్కె జాస్మిన్ 573 మార్కులు సాధించి నాలుగవ టాపర్గా నిలిచారు. కొమరోలు మండలం నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు మొత్తం 448 విద్యార్థులు హాజరుకాగా ,వారిలో 267 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు దీనితో కొమరోలు మండలానికి 60 శాతం ఉత్తీర్ణత లభించినట్లు అయిందని కొమరోలు మండల విద్యాశాఖ అధికారి 2 బొర్రా వెంకటరత్నం తెలిపారు.




## మార్టూరు సమగ్రాభివృద్ధికి
# కృషి చేస్తా

- చరిత్రలోనే కనీవిని ఎరుగని అభివృద్ధి
- ఇంటింటికి కుళాయి తో మంచినీరు
- ప్రతి గ్రామంలో సమస్యలపై స్పష్టత
- మార్టూరులో చెత్త సేకరణకు రిక్షాలు
-పంచాయతీలో చెత్తబుట్టల పంపిణీ
-వైసీపీ పాలనలో రాష్ట్రం విధ్వంసం
-రూ300 కోట్ల పనులు నిలిపిన వైసిపి ప్రభుత్వం
-అసమర్ధ పాలనతో అభివృద్ధిలో పదేళ్లు వెనక్కి
-చంద్రన్న పాలనతో గాడిలోకి అభివృద్ధి
-సులబ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఏలూరి



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 24**






మార్టూరు పంచాయతీ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని, సమస్యలు, చేయాల్సిన అభివృద్ధిపై స్పష్టమైన అవగాహన ఉందని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. గురువారం మార్టూరు గ్రామపంచాయతీ పరిధిలోని నూతన సులబ్ కాంప్లెక్స్ ను ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ పంచాయతీలో చెత్త సేకరణ రిక్షాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటికి చెత్తబుట్టలను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా పర్చూరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపానన్నారు. కోట్లాది రూపాయల నిధులతో అన్ని రంగాలను అభివృద్ధి చేశానని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం పాలనలో రాష్ట్రం విధ్వంసానికి గురైందన్నారు. రాష్ట్రంలో కోట్లాది రూపాయల పనులను ఎక్కడికక్కడ నిలిపివేశారని, దీంతో అభివృద్ధి పూర్తిగా నిలిచిందన్నారు.రాష్ట్రం అభివృద్ధిలో 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయలతో చంద్రబాబు పనులను ప్రారంభిస్తే ఆ పనులు అన్నిటిని రద్దుచేసి అభివృద్ధికి ఆటంకం కలిగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మన పర్చూరు నియోజకవర్గంలో 300 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు నిలిపివేసిన ఘనత వైసిపి దేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం మళ్ళీ ప్రజాపాలనకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో నిలిచిన అభివృద్ధిని కొనసాగించేందుకు రాష్ట్ర పునర్నిర్మాణానికి సీఎం చంద్రబాబు కంకణం కట్టుకున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నారని వెల్లడించారు. నియోజకవర్గానికి ఇటీవల ముఖ్యమంత్రి వచ్చిన సందర్భంగా వరాల జల్లు కురిపించారని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ త్వరలో అమలవుతాయని పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి సమస్యపై పూర్తి అవగాహన స్పష్టత ఉందన్నారు. రాబోయే ఆ నాలుగేళ్లలో అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజా అవసరాలను అనుగుణంగా దశలవారీగా అభివృద్ధి పనులు అన్నిటిని పూర్తిచేసే బాధ్యత తనదేనన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దానని ఎమ్మెల్యే ఏలూరి వెల్లడించారు. రాబోయే మూడేళ్లలో ప్రతి ఇంటికి కుళయి ద్వారా సురక్షిత నీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా మార్టూరు పట్టణంలో ప్రజలకు ఉపయోగపడేలా సులబ్ కాంప్లెక్స్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మార్టూరుకు చెందిన శ్రీరామ్ రామయ్య గోవిందమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీరామ్ శేషగిరిరావు మార్టూరులో వాటర్ ప్లాంట్ కు రూ 2 లక్షల విరాళంను ఏలూరి చేతుల మీదుగా అందజేశారు.


**విద్యార్థులకు అభినందనలు...**

మార్టూరు శ్రీహర్షిని ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులను ఎమ్మెల్యే ఏలూరి అభినందించారు. ఇటీవల విడుదల చేసిన పదో తరగతి పరీక్ష ఫలితాలలో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శాలువాతో సత్కరించి అభినందించారు. యాజమాన్యానికి ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించాలని యాజమాన్యానికి సూచించారు. 600 మార్కులకు గాను 592 మార్కులు సాధించిన జొన్నలగడ్డ భాను ప్రత్యూష ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేకంగా అభినందించారు. 590 మార్కులు సాధించిన రావుల నీరజ్, 588 మార్కులు సాధించిన కృష్ణ కార్తీక్ ను ఎమ్మెల్యే ఏలూరి అభినందించారు. విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. భవిష్యత్తు అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

# వక్ఫ్ చట్ట సవరణ వల్ల పేద ముస్లింలకు ప్రయోజనం

## రాష్ట్ర బిజెపి నేత షేక్ బాజీ స్పష్టం

**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 24**



కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వర్క్ చట్ట సవరణ వల్ల పేద, బలహీన, వితంతు మహిళలకు ఎంతో ప్రయోజనం అని రాష్ట్ర బిజెపి పార్టీ మైనారిటీ మోర్చా అధ్యక్షులు షేక్ బాజీ చెప్పారు గురువారం నాడు స్థానిక సాయి కళ్యాణమండపంలో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి వక్ఫ చట్ట సవరణ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు సదస్సుకు జిల్లా బిజెపి అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా షేక్ బాజీ మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న వక్ఫ చట్టంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని చెప్పారు ఆయా సమస్యలను రూపుమాపేందుకే భారత ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో చట్ట సవరణకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు ముస్లిం వర్గానికి చెందిన కొందరు వక్ఫ్ ఆస్తులను అన్యాక్రాంతం చేస్తున్నారని, వాటిపై వచ్చే ఆదాయంతో ఆర్థికంగా బలపడుతున్నారని ఆయన చెప్పారు అలాకాకుండా ముస్లింల ఆస్తుల ఆదాయం పేద మైనార్టీలకే చెందాలనే సదుద్దేశంతో నరేంద్ర మోడీ గతంలో ఏ ప్రధాని చేయని సాహసంతో పేద ముస్లింలకు బాసటగా నిలిచారని బాజీ కొనియాడారు సదస్సుకు అధ్యక్షత వహించిన బిజెపి జిల్లా అధికార ప్రతినిధి విజయలక్ష్మి మాట్లాడుతూ 1954 పార్లమెంటు చట్టం ద్వారా బోర్డు ఏర్పాటయింది అన్నారు ఇది ధార్మిక సంస్థ కాదని కేవలం పరిపాలన సంస్థ మాత్రమేనని విజయలక్ష్మి స్పష్టం చేశారు పేద ముస్లిం వర్గాలకు న్యాయం చేసేందుకు 20 25 వక్ఫ చట్ట సవరణ చేస్తే తప్పేమిటని ఆమె ప్రశ్నించారు బంగ్లాదేశ్, పాకిస్తాన్ లాంటి దేశాలలో బోర్డులు ఉన్నప్పటికీ అందుకు సంబంధించిన ఆస్తులన్నీ ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటున్న విషయాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు పేద ముస్లిం వర్గాల సంక్షేమం కోసం భారత ప్రధాని నరేంద్ర మోడీ తీసుకున్న సాహసోపేతమైన చర్యకు ముస్లిం వర్గాలు మద్దతు పలకాలని విజయలక్ష్మి కోరారు ఈ సదస్సులో బిజెపి సీనియర్ నాయకులు మాగులూరి రామయ్య, మండల బిజెపి అధ్యక్షులు దోర్నాల రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాదర్ భాష, పట్టణ బిజెపి అధ్యక్షులు యుద్ధం మహేష్, ఎస్ రఫీ, ఎస్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## ఓబులక్కపల్లి సర్పంచ్‌కు ఉత్తమ అవార్డు



**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 24**

మండలంలోని ఓబులక్కపల్లి గ్రామ సర్పంచ్ ఆవుల వెంకటసుబ్బారెడ్డికి అవార్డు దక్కింది ఆయనకు స్థానిక సేవా నాయకత్వ అవార్డు లభించింది ఓబులక్కపల్లి పంచాయతీని అన్ని విధాల అభివృద్ధి చేసినందుకు సర్పంచ్ సుబ్బారెడ్డికి అవార్డు దక్కింది జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం నాడు ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బారెడ్డి రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు అవార్డు పొందిన సర్పంచ్ సుబ్బారెడ్డిని పలువురు అభినందించారు.

## డిఇఓను సత్కరించిన తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 24**

10 వ తరగతి ఫలితాల్లో ప్రకాశం జిల్లాలో బాలబాలికలు 25103 మంది ఉత్తీర్ణత (85.43%) సాధించడం పట్ల డిఈఓ కిరణ్ కుమార్ ని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మన్నం శ్రీనివాస్, చెరుకూరి పూర్ణ చంద్రరావు, కొత్తగొర్ల వెంకటరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అర్రిబోయిన రాంబాబు, యనమల ఆంజనేయులు, మోతుకూరి రవీంద్ర, బలుసుపాటి బాపూజీ, నాగినేని నాగేశ్వరావు, కే, సాంబశివ రావు, జి శ్రీనివాస రావు తదితరులు శాలువా తో సత్కరించి పుష్ప గుచ్చం అందించి అభినందనలు తెలిపారు.

## మన్నేపల్లి కార్తీక్ ను సన్మానించిన పాఠశాల సిబ్బంది



**చంద్రశేఖరపురం, పెన్ పవర్ ఏప్రిల్ 24**

చంద్రశేఖరపురం మండలంలోని ముండ్లపాడు గ్రామంలో ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్తులకు విద్యార్థిని విద్యార్థులకు వార్షికోత్సవం నకు వచ్చిన ప్రతి ఒక్కరికి భోజన వసతి కల్పించిన మండల తెలుగు యువత నాయకులు మన్నేపల్లి కార్తీక్ ను పాఠశాల సిబ్బంది శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా మన్నేపల్లి కార్తీక్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది గ్రామస్తులు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## క్విస్ కళాశాలలో పోషణ్ పక్వాడ వారోత్సవాలు

**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 24**

ఒంగోలు క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పోషక్ పక్వాడ్ వారోత్సవాలు నిర్వహించారు. వారం రోజులపాటు సమయంలో ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం మంచి చర్య అని విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్య కల్యాణ్ చక్రవర్తి అన్నారు. ప్రతి ఒక్కరు మంచి ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ హనుమంతరావు, ఎన్ ఎస్ ఎస్ డీన్ డాక్టర్ నవనీత కృష్ణన్, శిరీష, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



# మహిళా సాధికారతే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**ప్రతి పథకాన్ని అమలుచేసి తీరుతాం**

**కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు**

**ప్రతిదీ చేతల చేసిచూపిస్తాం**

**నాటి వైకాపా మహిళా ఆర్థికాభివృద్ధి కి ఏమిచేయలేదు**

**ఎన్ని బటన్లు నొక్కినా పారదర్శకత లేదు**

**కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించిన**

**గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల**





**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 24**

మహిళా సాధికారతే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం యొక్క లక్ష్యమని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం గిద్దలూరు పట్టణంలోని స్టేట్ బ్యాంక్ పైన ఉన్నటువంటి సచివాలయ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణా కేంద్రాన్ని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం మహిళా పక్షపాతి ప్రభుత్వమని సీఎం నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు పేదింటి మహిళలు ఆర్థికంగా స్థిరపడాలనే ఉద్దేశంతో వారికి కుట్టు మిషన్ల శిక్షణా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని నేడు గిద్దలూరు నియోజకవర్గంలో ప్రారంభించటం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ ఒక్క హామీని నెరవేరుస్తామని దీపం పథకం ద్వారా ఇప్పటికే ఉచిత సిలిండర్లు అందచేస్తున్నామని, జూన్ నాటికీ ప్రతీ ఒక్కరికి తల్లికి వందనం ద్వారా ప్రతీ తల్లికి నగదును వారి అకౌంట్లలో జమ చేస్తామని, గత వైకాపా పాలకుల లాగా మాటల ప్రభుత్వం కాదని, ఆ ప్రభుత్వం హయాంలో పేదల అభివృద్ధి కి దోహదపడిన దాఖలాలు లేవన్నారు. ఏ పథకం కూడా సరిగా అమలు చేయలేదన్నారు. బటన్ నొక్కటమే గాని ఆ నగదు లబ్ధిదారుల ఖాతాలో జమ కాలేదని , అయినా రాష్ట్రం అప్పుల





ఊబిలో దించిపోయారని , కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విచ్ఛిన్నం అయిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూనే మహిళల సాధికారత కు కృషి చేస్తున్నామన్నారు. నాడు ఎన్నికల్లో చెప్పిన ప్రతీ పథకాన్ని , హామీలను అమలు చేసి తీరుతామన్నారు. మాధి మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అన్నారు. అత్తాడుగువారి శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో గిద్దలూరు నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, సొసైటీ బ్యాంకు చైర్మన్ దుత్తా బాల ఈశ్వరయ్య, నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులు, తాహసిల్దార్ ఆంజనేయ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ బూనబోయిన చంద్రశేఖర్ యాదవ్, మండల, పట్టణ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, సయ్యద్ శానేశావలి, పట్టణ కౌన్సిలర్లు, నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పొదిలిలో కంప్యూటర్ ఎడ్యుకేషన్ ప్రారంభం





**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 24**

పొదిలిలో నూతనంగా కంప్యూటర్ ఎడ్యుకేషన్ కేంద్రం ఏర్పాటు జరిగింది స్థానిక విశ్వనాథపురం లోని సబ్ స్టేషన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ వి ఐ టి కంప్యూటర్ ఎడ్యుకేషన్ సెంటర్ ను గురువారం నాడు మండల విద్యాశాఖ అధికారి ఎం శ్రీనివాసులు రెడ్డి ప్రారంభించారు ఈ సందర్భంగా ఎం ఈ ఓ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కంప్యూటర్ పరిజ్ఞానం యొక్క ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు గ్రామీణ ప్రాంతంలో అతి తక్కువ ఫీజులతో కంప్యూటర్ విద్యను నేర్పించేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఎంతైనా సంతోషదాయకమని చెప్పారు కంప్యూటర్ ఎడ్యుకేషన్ నిర్వాహకులు వెంకటేశ్వరరెడ్డి, రేణుక రెడ్డి దంపతులు మాట్లాడుతూ అత్యాధునిక పరిజ్ఞానంతో కంప్యూటర్ విద్యను నేర్పించేందుకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని నిర్వాహకులు వెంకటేశ్వరరెడ్డి, రేణుక రెడ్డి లు కోరారు.

## ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

**సర్పంచ్. షేక్. మహబూబ్ పీరా**



**పెన్ పవర్, కంభం ఏప్రిల్ 24 :**

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా కంభం మండలం హజరత్ గూడెం పంచాయతీ కార్యాలయంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ సర్పంచ్ షేక్. మహబూబ్ పీరా పంచాయతీ సెక్రెటరీ ఉమామహేశ్వరి మహాత్మా గాంధీ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టం ఏర్పాటు పై వారు మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేశ్వర్లు టిడిపి నాయకులు కరీముల్లా ఉపాధి సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భగవాన్ శ్రీ సత్యసాయిబాబా ఆరాధన మహోత్సవం





**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 24**

భగవాన్ శ్రీ సత్యసాయిబాబా ఆరాధన మహోత్సవం ఒంగోలు మంగమూరు రోడ్డు జడ్పీ కాలనీలో బాబా మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా సేవా సమితి వారు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఎండాకాలంలో మంచినీటి చలివేంద్రాల ఏర్పాటు, పేదలకు విద్యను అందించడం, రిమ్స్ హాస్పటల్లో ప్రతిరోజు భోజనం పెట్టడం వంటి మంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. మందిర కన్వీనర్ కోడెల శ్రీనివాసరావు మాట్లాడుతూ బాబా ఆరాధన సందర్భంగా ఉదయం ఓంకారం సుప్రభాత నగర సంకీర్తనతో ప్రారంభమై లోక కళ్యాణార్థం గాయత్రి మహా యజ్ఞం మహా నారాయణ సేవ అన్న సంతర్పణ వేద పఠనము సంగీత విభావరి మ్యూజికల్ ప్రోగ్రాం వీణ మహా మంగళహారతి ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా విభాగం, యువజన విభాగం కార్యక్రమానికి వారు సేవలందించారు. ఆరాధన మహోత్సవ సందర్భంగా ఒంగోలు నగర ప్రజలు భారీ సంఖ్యలో హాజరై స్వామి వారి ఆశీస్సులు పొందారు.

## దాదా ఫుడ్ కోర్ట్ ప్రారంభం

**ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి.**



**పెన్ పవర్, కంభం ఏప్రిల్ 24:**


కంభం పట్టణం స్మార్ట్ బజార్ పక్కన తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకులు షేక్ అత్తర్ హుస్సేన్ దాదా నూతనంగా ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్ట్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ఫుడ్ కోర్టును ప్రారంభించారు. మంచి రుచిని నాణ్యతను ప్రజలకు అందించి మంచి లాభాలతో వ్యాపారం ముందుకు సాగాలని యాజమాన్యానికి తెలియచేశారు. సరసమైన ధరల అందించే ఫుడ్ కోర్టు నాణ్యత లో రాజకూడదని కోరారు. మంచి లాభాలు కట్టించి పేరు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ మరియు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ సర్పంచ్‌గా షేక్ ఖాదర్ బీ బుజ్జి



**చంద్రశేఖరపురం,పెన్ పవర్ ఏప్రిల్ 24**

చంద్రశేఖరపురం మండలం లోని కోవిలంపాడు సర్పంచ్ షేక్ ఖాదర్ బీ బుజ్జి నాలుగోసారి జిల్లా ఉత్తమ స్థానిక నాయకత్వ సేవ పురస్కారం పొందారు. ఒంగోలులో జరిగిన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకల సందర్భంగా సమావేశమునకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ మరియు పంచాయతీరాజ్ వ్యవస్థాపక జాతీయ ప్రధాన కార్యదర్శి వీరభద్రచారి చేతుల మీదుగా పురస్కారం ప్రధానం చేశారు. ఈ సందర్భంగా షేక్ ఖాదర్ బీ బుజ్జి మాట్లాడుతూ పంచాయతీలోని గ్రామస్తులకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ, ప్రజాస్వామ్యంలో ప్రజలకు అత్యంత చేరువుగా ఉండే పంచాయతీరాజ్ స్థానిక ప్రజా ప్రతినిధి వ్యవస్థలో అందుబాటులో ఉంటున్న సందర్భంలో ఈ ఉత్తమ స్థానిక నాయకత్వ సేవా పురస్కారం రావడం చాలా సంతోషంగా ఉందని, ప్రజలకు సేవ చేసే బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు షేక్ ఖాదర్ బీ బుజ్జి నీ అభినందించారు.



మహాత్మాగాంధీ బల్వంత్‌రాయ్ మెహతా

నేషనల్ లోకల్ గవర్నమెంట్స్ ఛాంబర్

ఆంధ్రప్రదేశ్ గ్రామ స్వరాజ్య సాధన సమితి వారి ఆధ్వర్యంలో

జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవములు - 2025

ఏప్రియల్ 24 నుండి 27 వరకు, ఒంగోలు.

ఉత్తమ స్థానిక నాయకత్వ సేవా పురస్కారం

పేరు షేక్. ఖాదర్ బి బుజ్జి

పదవి సర్పంచ్ గ్రామము కోవెలంపాడు

మండలం C.S.పురం ప్రకాశంజిల్లా.

ప్రజాస్వామ్యంలో ప్రజలకు అత్యంత చేరువగా ఉండే పంచాయితీరాజ్ స్థానిక ప్రజాప్రతినిధి వ్యవస్థలో, తమరు K.V.పాడు ప్రజాప్రతినిధిగా ప్రజాభిమానంతో తమ పదవీ కాలంలో ప్రజారంజక పాలన సాగిస్తున్నందుకు, తమరిని ఉత్తమ స్థానిక నాయకత్వ సేవా పురస్కారముతో గౌరవిస్తూ.... మున్ముందు మరిన్ని ఉన్నత పురస్కారములతో ప్రజాభిమానాన్ని పొందాలని ఆశిస్తున్నాము.

జి.వీరభద్రాచారి
జాతీయ ప్రధానకార్యదర్శి

మామిడి అప్పలనాయుడు
జాతీయ అధ్యక్షులు

## శీలంవారిపల్లిలో ఉచిత వైద్య శిబిరం

**చంద్రశేఖరపురం,పెన్ పవర్ ఏప్రిల్ 24**

కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో నాలుగవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం కార్యక్రమంలో భాగంగా నాలుగవ రోజు గురువారం శీలంవారిపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జి.నిఖిత రాణి ద్వారా గ్రామంలోని ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను గ్రామ ప్రజలు,పెద్దలు అభినందలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఇన్చార్జ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీవిద్య, ఏ యన్ యం రమాదేవి, ఆషా వర్కర్స్,విద్యార్థులు,గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



# స్వయం పాలనతో గ్రామాభివృద్ధి

## - ఏపీటిడిసి చైర్మన్ డాక్టర్ నూకసాని





**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 24**

గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి, స్వయం పాలన ద్వారా అభివృద్ధిని సాధించడమే గ్రామ స్వరాజ్ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటిడిసి) చైర్మన్ డా. నూకసాని బాలాజీ తెలిపారు. ఒంగోలు పట్టణంలో నేషనల్ లోకల్ గవర్నమెంట్ ఛాంబర్, ఆంధ్రప్రదేశ్ గ్రామ స్వరాజ సాధన సమితి సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం – 2025 సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటిడిసి) చైర్మన్ డా. నూకసాని బాలాజీ మాట్లాడుతూ, పంచాయతీరాజ్ వ్యవస్థ గ్రామీణ అభివృద్ధికి మూలస్తంభంగా నిలుస్తుందన్నారు. గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్న ప్రజాప్రతినిధులు, ముఖ్యంగా సర్పంచులు నిజమైన మార్గదర్శకులుగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉత్తమ సేవలు అందించిన సర్పంచులను గుర్తించి ఉత్తమ స్థానిక నాయకత్వ సేవ పురస్కారాలు , ప్రశంసా పత్రాలను చైర్మన్ నూకసాని బాలాజీ స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, జిల్లా సర్పంచ్ ల సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు వీరభద్రా చారి, ప్రధాన కార్యదర్శి వసంత, జిల్లా కార్యదర్శి రాజమ్మ, కార్యవర్గ సభ్యులు రమేష్, ఇతర నాయకులు, జిల్లాలోని వివిధ మండలాల నుండి పెద్ద సంఖ్యలో విచ్చేసిన సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధికి సంబంధించిన అనేక అంశాలపై చర్చ జరగడంతో పాటు, పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేక సదస్సు కూడా నిర్వహించబడింది. ఈ సందర్భంగా డా. నూకసాని బాలాజీ గారు పంచాయతీరాజ్ చట్టం ద్వారా సాధించిన విజయాలను గుర్తుచేస్తూ, స్థానిక స్వయం పాలనను సమర్థంగా అమలు చేయాల్సిన అవసరాన్ని తెలిపారు. గ్రామాభివృద్ధి లోకల్ నాయకత్వం ద్వారా సాధ్యమవుతుందని, ప్రభుత్వ పథకాల అమలులో సర్పంచుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

## పదవ తరగతి ఫలితాల్లో రాణించిన విద్యార్థికి గునుపూడి దంపతుల అభినందనలు



**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 24**

పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో రాణించిన విద్యార్థికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గునుపూడి భాస్కర్, మాధవి దంపతులు అభినందించారు పొదిలికి చెందిన సామి ఆకాష్ అనే విద్యార్థి స్థానిక మాంటిసోరి పాఠశాలలో 10వ తరగతి చదివి పరీక్షా ఫలితాల్లో 600 మార్కులు గాను 568 మార్కులు సాధించి నాలుగవ ర్యాంకులో నిలిచారు ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గునుపూడి భాస్కర్, మాధవి దంపతు లు గురువారం నాడు తన ఇంటికి పిలిచి, స్వీట్లు తినిపించి ఆకాష్ ను ప్రత్యేకంగా అభినందించారు ఈ కార్యక్రమంలో విద్యార్థి ఆకాష్ తో పాటు అతని తండ్రి సామి వెంకటరాజా, ప్రముఖ ఆధ్యాత్మిక వ్యక్తి మల్లికార్జున, కారం శెట్టి కిషోర్ తదితరులు కూడా పాల్గొన్నారు.

## పొదిలి కమిషనర్‌ను కలసిన దేశం నాయకులు



**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 14**

పొదిలి నగర పంచాయతీ కమిషనర్ కె.ఎల్.ఎన్ నారాయణరెడ్డిని గురువారం నాడు తెలుగుదేశం పార్టీ నాయకులు పలువురు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు నారాయణరెడ్డి బదిలీపై పొదిలి మున్సిపల్ కమిషనర్ గా బుధవారం నాడు తన ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భాన్ని పునస్కరించుకొని తెలుగుదేశం పార్టీ నాయకులు కమిషనర్ నారాయణరెడ్డిని ఆయన కార్యాలయంలో కలుసుకొని పలు విషయాలను ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు ముందుగా కమిషనర్ నారాయణరెడ్డిని శాలువా, పూలదండతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు కమిషనర్ నారాయణరెడ్డి నీ కలసిన వారిలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ రైతు విభాగపు కార్యదర్శి ఆవులూరి ఎల్లమంద, ఉప్పలపాడు సహకార సంఘం అధ్యక్షులు ఉలవ గోపి, తానికొండ వెంకట్రావు, వై వెంకటేశ్వర రెడ్డి,, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ బాషా, మాజీ శివాలయం చైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం

### పొదిలి మునిసిపల్ కమిషనర్ నారాయణరెడ్డి స్పష్టం

**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 24**



ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన ధ్యేయమని పొదిలి మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ నారాయణరెడ్డి స్పష్టం చేశారు ఆయన బుధవారం నాడు పొదిలి మున్సిపల్ కమిషనర్ గా బదిలీపై వచ్చి, ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా కమిషనర్ నారాయణరెడ్డి గురువారం నాడు మాట్లాడుతూ పొదిలి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు తాను కష్టపడి పనిచేసే మనస్తత్వం కలవాడిని, పొదిలి కమిషనర్ గా ప్రజలకు సేవ చేయాలనే సదుద్దేశంతో వచ్చానే తప్ప, ఏసి రూముల్లో సేద తీరటానికి రాలేదని నారాయణరెడ్డి చెప్పారు పొదిలి నగర పంచాయతీలోని సమస్యల్ని గుర్తించి, ఆయా సమస్యల పరిష్కారానికి గట్టి కృషి చేస్తానని ఆయన చెప్పారు జిల్లాకు నడికూడలి ప్రాంతమైన పొదిలి పట్టణంలో ట్రాఫిక్ సమస్య ప్రధానంగా ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు రోడ్లపైకి దుకాణాలు రావడం, షాపుల ముందు మరి కొంతమందికి అద్దెలకు ఇవ్వడం లాంటి సంఘటనల వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు తాను గుర్తించడం జరిగిందన్నారు త్వరలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం రోడ్లు భవనాల శాఖ అధికారుల సహకారంతో అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు పొదిలి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడపడమే ధ్యేయంగా విధులు నిర్వర్తిస్తానని, ఇందులో ఎటువంటి రాజీ పడే ప్రసక్తే లేదని కమిషనర్ నారాయణరెడ్డి స్పష్టం చేశారు పొదిలి పట్టణ అభివృద్ధిలో తన మార్కును చూపిస్తానని, అందుకు ప్రజలు కూడా తన విధులకు సహకరించాలని నారాయణరెడ్డి కోరారు.

## గణేషని పల్లిలో ఉచిత వైద్య శిబిరం

### 150 మందికి వైద్య పరీక్షలు





**చంద్రశేఖరపురం, పెన్ పవర్ ఏప్రిల్ 24**

చంద్రశేఖరపురం మండలం లోని రేగులచెలక పంచాయతీ పరిధిలోని గణేశుని పల్లి గ్రామంలో గల సాయి వైద్యశాల యందు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 150 మంది రోగులను పరీక్షించి వైద్య సేవలు అందించినట్లు ఆర్ఎంపి వైద్యులు రజాక్ తెలిపారు. పామూరు మల్లికార్జునరెడ్డి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కు చెందిన సాయి ప్రజా వైద్యశాల ఆధ్వర్యంలో ఆర్ సి ఎం చర్చి నందు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వి బైలు చెన్నపు నాయునిపల్లి, ఏ కొత్తపల్లి, అంబవరం రేగులచెలక, అయ్యలూరివారిపల్లి గ్రామాలకు చెందిన అనేకమంది రోగులు ఈ వైద్య శిబిరంలో పాల్గొని చికిత్స చేయించుకున్నారు. ఎముకల కీళ్ల వైద్య నిపుణులు మల్లికార్జున రెడ్డి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముఖ్యంగా ఎముకలు కీళ్లు నరాల బలహీనత మోకాలు నొప్పులు తదితర వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు ఈ సందర్భంగా వైద్యులు మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో ఉచితంగా వైద్య సేవలు అందించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు ఆర్ఎంపీ వైద్యులు రజాక్ ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో చర్చి ఫాదర్ బొట్టు మనోహర్ గ్రామ పెద్దలు పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## శీలంవారిపల్లెలో వైభవంగా మహా మండలభిషేక మహోత్సవ కార్యక్రమం



**చంద్రశేఖరపురం, పెన్ పవర్ ఏప్రిల్ 24**

చంద్రశేఖరపురం మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో రిటైర్డ్ స్పెషల్ కలెక్టర్ పిడుగు బాబురావు ఆధ్వర్యంలో శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నూతన విగ్రహ ప్రతిష్ట ఏర్పాటుచేసి 41 రోజులు విజయవంతముగా పూర్తి చేసిన సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా మండలభిషేకం మహోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా అర్చకులు భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ స్పెషల్ కలెక్టర్ పిడుగు బాబురావు కుటుంబ సభ్యులు, కదిరి నరసింహ, పిడుగు హరి నారాయణ, యం. పరమేష్, కొట్టే కిరణ్, ఎల్ మురళి తదితరులు పాల్గొన్నారు.

## శీలంవారిపల్లి పాఠశాలలో సిమెంటు బల్లాలు ధ్వంసం





**చంద్రశేఖరపురం, పెన్ పవర్ ఏప్రిల్ 24**

చంద్రశేఖరపురం మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ టు ఆవరణలో ఏర్పాటు చేసిన సిమెంట్ బల్లలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఇటీవల పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ యం.మస్తాన్ రెడ్డి దాతల సహకారంతో కూర్చునేందుకు ఏర్పాటు చేసారు. ఈ విషయము తెలుసుకొని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతయ్య ధ్వంసమైన బెంచిలను పరిశీలించి గ్రామస్తులకు, ప్రజాప్రతినిధులకు, విద్యా కమిటీకి తెలియజేశారు. విద్యా కమిటీ చైర్మన్ యం మస్తాన్ రెడ్డి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

## మెడికల్ బోర్డు ఇచ్చిన అంగవైకల్య సర్టిఫికెట్లు అనుమతించాలి

### ఏపీటీఎఫ్ సి యస్ పురం మండల శాఖ

**చంద్రశేఖరపురం, పెన్ పవర్ ఏప్రిల్ 24**

గతంలో జిల్లా మెడికల్ బోర్డుల ద్వారా జారీ చేసిన అంగవైకల్య సర్టిఫికెట్లు చెల్లవని వాటి ద్వారా బదిలీలలో ఎలాంటి పాయింట్లు ఇవ్వకుండా, ఆ ఉపాధ్యాయులను వెనక్కి తిప్పి పంపడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, వెంటనే జిల్లా మెడికల్ బోర్డు ఇచ్చిన సర్టిఫికెట్లు కూడా అనుమతి ఇచ్చి వారికి న్యాయం చేయాలని ఏపీటీఎఫ్ సిఎస్ పురం మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు , జె ఎస్ ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్ డిమాండ్ చేశారు. దాదాపు 15 సంవత్సరాల క్రితం జిల్లా మెడికల్ బోర్డుల ద్వారా జారీ చేయబడ్డ అంగవైకల్య సర్టిఫికెట్లు ఉన్న ఫలంగా చెల్లవని నిర్ణయించడం అన్యాయమని వారు తెలిపారు. వాటి ద్వారానే వారు ఉద్యోగంలో చేరాలని ప్రభుత్వం ఏ సందర్భంలోనూ వాటిని సదరం సర్టిఫికెట్లుగా మార్చుకోవాలని ఎలాంటి నిబంధన ఇవ్వలేదని, వారందరికీ ఇప్పటివరకు బదిలీల్లో స్పెషల్ పాయింట్ లు ఇచ్చారని ఇప్పుడు హఠాత్తుగా సర్టిఫికెట్లు తెచ్చుకోమంటే ఒక రోజులో ఎలా సాధ్యపడుతుందని వారు ప్రశ్నించారు. కాబట్టి ఈ ఒకసారి కి జిల్లా మెడికల్ బోర్డుల సర్టిఫికెట్లు అనుమతించాలని వారు కోరారు. వారికి కొంత సమయం ఇచ్చి ఆ సమయంలో సదరం సర్టిఫికెట్లు తెచ్చుకోవడానికి అవకాశం ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అంగ వైకల్య ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని వారు కోరారు.

## టెన్త్ పరీక్ష ఫలితాలలో కొమరోలు

## ప్రభుత్వ హైస్కూల్ స్థాయి టాపర్ గా నిలిచిన కరిష్మా బేగం

**6 మార్కులకు 557 మార్కులు సాధించిన కరిష్మా బేగం.**

**కరిష్మాను అభినందించిన ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు సిబ్బంది.**

**500 లకు పైగా మార్పు సాధించిన ఏడు మంది విద్యార్థులు.**



**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 24**

కొమరోలు లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పి కరిష్మా బేగం పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాలలో 600కు 557 మార్కులు సాధించి పాఠశాల స్థాయిలో టాపర్గా నిలిచింది. ఆ పాఠశాల నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు 144 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 87 మంది ఉత్తీర్ణులయ్యారు.దీనితో ఆ పాఠశాలకు 39 శాతం ఉత్తీర్ణత లభించింది. కాగా అదే పాఠశాల కు చెందిన పి కరిష్మా బేగం 600 మార్కులకు 557 మార్కులు సాధించి పాఠశాలలో టాపర్గా నిలిచింది. దీనితో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొర్ర కాశయ్య, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు అశ్విని కుమార్, సైన్స్ ఉపాధ్యాయులు విశ్వరూప చారి, రహమత్, నిర్మల కుమారి నిర్మల కుమార్, సాంబశివరావు ,తదితరులు కరిష్మా బేగం ను ప్రత్యేకంగా అభినందించారు. ఇక పాఠశాల నుంచి ఏడు మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు . సిహెచ్ వైష్ణవి మహేంద్ర 556 మార్కులు ,ఎం జాహ్నవి 554,మార్కులు, పి వెంకట శివ 554 మార్కులు, ఎస్కే మహమ్మద్ ఫరూక్ 553 మార్కులు ,ఏ ప్రవీణ548 మార్కులు, జె వైష్ణవి 531 మార్కులు, సాధించి పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు సాధించి పెట్టారు ఆ విద్యార్థులు అందరిని కూడా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అభినందించారు.

## నేడు ఎమ్మెల్యే ఏలూరి టూర్ షెడ్యూల్



**రిపోర్టర్ మార్టూరు, పెన్ పవర్ ఏప్రిల్ 24**

నేడు (శుక్రవారం)ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గారి పర్యటన వివరాలు ఇలా. ఉదయం 10:30 గంటలకు పర్చూరు మండల కేంద్రంలోని టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవం లో పాల్గొంటారు.

ఉదయం 11 గంటలకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో యాంత్రికరణ పరికరాలు అందజేత కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 11.30 గంటలకు సాకేత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం అందజేసే కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యే ఏలూరి చేతుల మీదుగా చిరు వ్యాపారులకు నాలుగు చక్రాలు(తోపుడు బండ్లు) పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం 12:30 గంటలకు దివ్యాంగులకు ఎలక్ట్రికల్ వాహనాలను పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం 12:40: వెలుగు ఆధ్వర్యంలో పి ఎం జి ఎస్ వై నిరుద్యోగ భృతి కింద కెమెరాలను పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం 12:45 ప్రసన్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభోత్సవం చేస్తారు. మధ్యాహ్నం 12:50: ఎన్టీఆర్ స్టేడియం పరిశీలిస్తారు. చిన్నగంజాం మండలం గొనసపూడి గ్రామంలో పర్యటిస్తారు.

## డివిజన్‌లో సమస్యలు పరిష్కరించండి

**– మునిసిపల్ కమిషనర్‌కు పెద్దిశెట్టి చంద్ర–వరలక్ష్మి వినతి**





**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 24**

ఇటీవల పడిన అకాల వర్షం వలన రాజా పానగల్ మెయిన్ రోడ్డు మేజర్ డ్రైన్స్ కల్వర్టర్స్ కింద పూర్తిగా మట్టి పేరుకొని పోవటంతో మునిసిపల్ వాటర్ వచ్చినప్పుడు నీళ్లు రోడ్డున పడుతున్నందున ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ చే రాజా పానగల్ మెయిన్ రోడ్డు 1వ లైన్ నుంచి 14 లైన్ వరకు స్పెషల్ డీసిల్టేషన్ కార్యక్రమం చేపట్టవలసిందిగా 29వ డివిజన్ అధ్యక్షులు పెద్దిశెట్టి చంద్ర–వరలక్ష్మి లు ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ డా.కోడూరి వెంకటేశ్వర రావు కు వినతిపత్రం అందజేశారు.అనంతరం మునిసిపల్ ఎంఈ ని కలిసి డివిజన్ లో 3 బోరింగులు పూర్తిగా పాడైపోయినందున వాటి స్థానంలో కొత్త బోరింగులు వేయవలసిందిగా కోరారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# గ్రానైట్ పరిశ్రమను ఆదుకోండి

### –ఎమ్మెల్యే ఏలూరి ఆధ్వర్యంలో భూగర్భ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కు వినతి

### – మంత్రి కొల్లు రవీంద్రతో ఎమ్మెల్యే ఏలూరి భేటీ





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 24**

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో గ్రానైట్ పరిశ్రమ రాష్ట్రానికి తలమానికంగా నిలుస్తుందని, గ్రానైట్ పరిశ్రమ తీవ్ర సంక్షోభనికి గురైందని గ్రానైట్ పరిశ్రమకు అండగా నిలిచి ఆదుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో గ్రానైట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు భూగర్భగనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కు వినతిపత్రం అందజేశారు. గురువారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరితో కలిసి నేతలు గ్రానైట్ సమస్యలపై చర్చించారు. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా వినతి పత్రంలో మంత్రి దృష్టికి తీసుకొచ్చిన అంశాలు ఇలా... ఉమ్మడి ప్రకాశం జిల్లా లో ఉన్న సమయంలో స్లాబు సిస్టం ప్రారంభ సమయంలో కలర్ గ్రానైట్ కి 22 క్యూబిక్ మీటర్స్ కు రాయల్టీ గెలాక్సీ సమానంగా రూ.27,000/–లు నిర్ణయించి వసూలు చేస్తున్నారు. కానీ రాష్ట్రమంతా కలర్ గ్రానైట్ కి రూ.22,000/– లు వసూలు చేస్తున్నారు. మా బాపట్ల జిల్లా గ్రానైట్ పరిశ్రమల వారికి 22 మీటర్లకు రూ.22,000/–లు వసూలు చేసే విధంగా ఉత్తర్వులు జారీ చేసి మా పరిశ్రమను ఆదుకోవాలన్నారు. గ్రానైట్ పలకలు విక్రయించే సమయంలో గ్రానైట్ పలకల కొలతలు వేసే క్రమము నందు పొడవు నందు 6, వెడల్పు నందు 3 అంగుళాల చొప్పున అలవెన్సు (భత్యము) ఇచ్చుట ఆనవాయితీ. మేము గ్రానైట్ పలకల రవాణా చేసే సమయంలో ఈ అలవెన్సును కూడా డిపార్ట్మెంట్స్ వారు (మైనింగ్ %ఇ% జియస్టీ) పరిగణనలోకి తీసుకొని భారీగా అపరాధ రుసుములు వేస్తున్నారు. కావున టన్నుకు 140 లేక 150 అడుగులు వస్తుంది. వీటిలో ఏదో ఒక విధముగా డిపార్టుమెంటు వారికి తగు ఉత్తర్వులు ఇప్పించి మా ఇబ్బందులు తొలగించాలన్నారు. ప్రస్తుతము స్లాబు సిస్టం నందు మేము రాయల్టీ చెల్లించిన తరువాత ఆ నెల చివరి వరకు మాత్రమే బ్లాకులు రవాణా చేసుకొనుటకు మాకు గడువు వున్నది. ఒక్కొక్కసారి వాతావరణము వల్ల కానీ లారీలు కొరత వల్ల కానీ నిర్ణయించిన గడువులో మేము బ్లాకులు రవాణా చేసుకోపోవటం వలన రాయల్టీ వ్యర్థమగుచున్నది. కావున బ్లాకులు రవాణా చేసుకొను గడువు కనీసం 3 నెలలుగా పొడిగించాలన్నారు. గత 10 సం..ల నుండి గ్రానైట్ పరిశ్రమ బాగా అభివృద్ధి చెంది పరిశ్రమలు బాగా ఏర్పడ్డాయి. నూతన మల్టీ కటర్స్ వచ్చి ఉన్నవి. గతంలో ఒక క్యూబిక్ మీటరుకు 350 చ.అడుగులు ఇచ్చియున్నారు. ఈ కొత్త మల్టీ కటర్ల వలన అది సుమారుగా 450 చ.అడుగులకి పెరిగినది. కావున మేము రవాణా చేసుకునే ముడిరాళ్ళకు ఈ అదనపు చ.అడుగులకు పరిమితులతో సంబంధం లేకుండా ఏయంఆర్ ద్వారా గానీ, లేక ఇతర విధానం ద్వారా గానీ రవాణా చేసుకొనేందుకు అనుమతులు ఇప్పించాలన్నారు. శ్లాబు సిస్టం నందు మేము క్వారీ నుంచి వినియోగించుకునే రాయి కొలతలు నిబంధనలు లేకుండా అన్ని సైజుల రాళ్ళకు పర్మిట్లకు అనుమతించాలన్నారు. నిర్దేశించిన పర్మిట్లు వినియోగించుకున్న తరువాత మాకు అవసరమైన పర్మిట్లు శ్లాబు సిస్టం ధర ప్రకారంగా అదనంగా ఇప్పించినట్లయితే తద్వారా ప్రభుత్వమునకు ఆదనపు ఆదాయం లభించి పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయన్నారు.

## ఉగ్రవాదం నశించాలని కోరుతూ పొదిలిలో బిజెపి ప్రదర్శన

**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 24**



ఉగ్రవాదం నశించాలని కోరుతూ గురువారం నాడు పొదిలిలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ప్రదర్శన జరిగింది స్థానిక సాయి కళ్యాణ మండపం వద్ద నుండి ప్రారంభమైన ప్రదర్శన పట్టణ పురవీధుల గుండా సాగింది ఈ సందర్భంగా రాష్ట్ర బిజెపి మైనారిటీ మోర్చా అధ్యక్షులు షేక్ బాజీ మాట్లాడుతూ కాశ్మీర్ లోని పహలాం వద్ద ఉగ్రవాదులు 26 మంది భారతీయులను నిర్దాక్షిణంగా చంపడాన్ని తీవ్రంగా ఖండించారు ఈ సంఘటనలో భావిస్తున్నారని అదే నిజమైతే పాకిస్తాన్ అందుకు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు ఉగ్రవాదంపై భారత ప్రధాని నరేంద్ర మోడీ, భారత హోం మంత్రి అమిత్ షా లు రాజీలేని పోరాటం చేస్తున్నారని ఆయన చెప్పారు ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెగలించేందుకు భారత ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని బాజీ స్పష్టం చేశారు ఇటువంటి దుర్మార్గమైన సంఘటనలను ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఖండించాలని ఆయన కోరారు ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ అన్ని విధాల భ్రష్టు పట్టిపోయిందని, ఇప్పటికి కూడా ఆ దేశానికి, అక్కడి పాలకులకు బుద్ధి రాకపోవడం శోచనీయమన్నారు ఉగ్రవాద చర్యలను వ్యతిరేకంగా వ్యవహరిస్తూనే భారత దేశ అభివృద్ధికి తన శక్తి వంచన లేకుండా ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు నరేంద్ర మోడీ పాలన విధానాలను చూసి అయినా పాకిస్తాన్ లాంటి దేశాలు బుద్ధి తెచ్చుకోవాలని బాజీ హితువు పలికారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి, మండల బిజెపి అధ్యక్షులు డి రమణారెడ్డి, పట్టణ బిజెపి అధ్యక్షులు యుద్ధం మహేష్, సీనియర్ నాయకులు మాగులూరి రామయ్య, ఎస్ రఫీ, షేక్ బాషా లతోపాటు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 24**

ఊరచెరువు, సమైక్యతా నగర్, కొత్త కూరగాయల మార్కెట్, ఆర్ టి సి బస్టాండ్, మఠం బజార్ ,బాలకృష్ణాపురం, కర్నూల్ రోడ్డు తదితర ప్రాంతాలలో విద్యుత్ మరమ్మత్తుల కారణం వలన శుక్రవారం ఉదయం 7 గం నుండి మధ్యాహ్నం 1 గం వరకు విద్యుత్తు సరఫరా అంతరాయం కలదని ఒంగోలు టౌన్ డి.ఈ.ఈ. కె వి పాండురంగ రావు తెలియజేశారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## నామమాత్రంగా సాగిన గుడ్లూరు పంచాయితీరాజ్ దినోత్సవం

### సమావేశంలో కనిపించని సర్పంచులు, ఎంపీటీసీలు



**గుడ్లూరు, పెన్ పవర్, ఏప్రిల్ 24:**

మండల కేంద్రమైన గుడ్లూరు ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవం నామ మాత్రంగా కొనసాగింది. స్థానిక ఎంపీడీఓ వై.వెంకటేశ్వరరావు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. పంచాయితీరాజ్ దినోత్సవం ను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జరుపాలని తెలుపగా, ఎంపీడీఓ ఈ కార్యక్రమం గురించి సర్పంచులకు, ఎంపీటీసీ లకు తెలిపినప్పటికీ, ఎందుకనో ఒకటి, అరా తప్ప మిగతా సర్పంచులు, ఎంపీటీసీలు ఎవ్వరూ ఈ సమావేశానికి హాజరు కాలేదు. వీటితో పాటు కొంతమేరా సభా ప్రాంగణంలో కుర్చీలు ఖాళీగా దర్శనం ఇవ్వడంతో పంచాయితీరాజ్ దినోత్సవ కార్యక్రమం కలతప్పి, నామ మాత్రంగా కొనసాగింది. హాజరైన ఒకటి, అరా సర్పంచులు భోజన సమయంలో కనిపించి, సమావేశానికి డుమ్మా కొట్టడం కొసమెరుపు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పులి రమేష్, డీఎల్పీఓ కృష్ణమోహన్, మండల టీడీపీ అధ్యక్షులు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ జానిగర్ల నాగరాజు, ఉమ్మనేని సుబ్బారావు, చిత్తారు మల్లికార్జున, పువ్వాడి వేణు, చుండూరి ప్రసాద్, పొట్టేళ్ల మురళి, మేకపోతుల రాఘవులు, గద్దగుంట శ్రీనివాసులు, సచివాలయాల సిబ్బంది, తదితర అధికారులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బైక్ ఢీకొని యువకుడు మృతి





**బెస్తవారిపేట, పెన్ పవర్ ఏప్రిల్ 24:**

ట్రాక్టర్లు బైకు ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని గలిజేరుకుల్ల గ్రామపంచాయతీ పరిధిలోని చెన్నుపల్లి గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం జరిగింది. వివరాల్లో కెళ్తే సిఎస్ పురం మండలం పిల్లిపల్లె గ్రామానికి చెందిన చిన్న కొండు అటేలయ్య (24) చేన్ను పల్లె గ్రామానికి మోటార్ సైకిల్ పై వెళ్తు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ డీ కొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన అటలయ్య చెన్నుపల్లి గ్రామంలో గురువారం ఉదయం జరిగిన వివాహానికి హాజరై వ్యక్తిగత పనులు నిమిత్తం గలిజేరుగుళ్ళ వచ్చి తిరుగు ప్రయాణంలో చెన్నుపల్లి వెళుతుండగా నేరెళ్ల వాగు వద్ద మట్టి ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అటలయ్య అక్కడికక్కడే మృతి చెందారు.స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో బేస్తవారిపేట ఎస్సై రవీంద్రారెడ్డి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## పెండింగ్ చలాన్లపై దృష్టి పెట్టిన పోలీసులు

**గుడ్లూరు, పెన్ పవర్, ఏప్రిల్ 24:**



పెండింగ్ చలానాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.;కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్లు నిర్వహిస్తున్నారు, దీనిలో భాగంగా మండల కేంద్రమైన గుడ్లూరులో పోలీసులు పెండింగ్ చలానాలు ఉన్న వాహనాలపై గురువారం తనిఖీ చేపట్టారు.;ఈ తనికీలను ఎస్సై వి.వెంకట్రావు దగ్గర ఉండి తన సిబ్బందితో చేపట్టారు. సరియైన ధృవపత్రాలు లేని పలు వాహనాలను తనికీ చేసి, వాహన చోదకులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. పెండింగ్ చలాన్ల చెల్లింపు విధానంపై వాహన చోదకులకు అవగాహన ఎస్సై కల్పించారు. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపుల గురించి ప్రత్యేకంగా అవగాహన కల్పించి, ట్రాఫిక్ రూల్స్ గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సోమి శెట్టి మధుసూదన్ కి వి.ఎస్.యూ వైస్-ఛాన్సలర్ ఘన నివాళి

**వెంకటాచలం, (పెన్ పవర్) ఏప్రిల్ 24**

నెల్లూరు జిల్లా కావలి పట్టణానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సోమి శెట్టి మధుసూదన్ , జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో ఇటీవల జరిగిన ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన మధుసూదన్ మృతదేహాన్ని సందర్శించిన విక్రమ సింహాపురి విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సునీత ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మధుసూదన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ ఘోర సంఘటన దేశవ్యాప్తంగా శోకాన్ని మిగిల్చినది.



పెన్ పవర్
నెల్లూరు । తిరుపతి । చిత్తూరు

# భారతదేశంలో ఉగ్రవాదులు ఎక్కడున్నా నిర్దాక్షిణ్యంగా ఏరివేయాల్సిన అవసరంఉంది

### ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్















**బ్యూరో రిపోర్టర్ పెన్ పవర్ నెల్లూరు- ఏప్రిల్ 24**

కాశ్మీర్ పహల్గాం ఉగ్రవాదుల దాడిలో అసువులుబాసిన కావలి వాసి మధుసూదన్ భౌతికకాయానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఆర్టీసీ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణ కాంత్, పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు పుష్పగుచ్చాలు సమర్పించి నివాళులర్పించారు. గురువారం కావలిలోని మధుసూదన్ స్వగృహానికి చేరుకున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. సోమిశెట్టి మధుసూదన్ రావు భౌతిక కాయం వద్ద శోకతప్త హృదయాలతో ఘన నివాళులర్పించారు. మధుసూదన్ భార్య, పిల్లలతో ఉగ్రవాదుల దాడి విషయాలను అడిగి తెలుసుకుని వారు ఆ సమయంలో అనుభవించిన మానసిక క్షోభ, దయనీయ పరిస్థితుల పట్ల ఆవేదనతో చలింపోయారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఇది అత్యంత హృదయ విదారక సంఘటన అని, భారతదేశం దీనిని మరచిపోదన్నారు. బాధిత కుటుంబ సభ్యుల బాధ, వారు అనుభవిస్తున్న మానసిక క్షోభ మాటల్లో చెప్పలేనిదిగా పవన్ భావోద్వేగంతో మాట్లాడారు. సంఘటనను తలుచుకుంటుంటే తన కడుపు రగిలిపోతుందని ఆవేదనకు గురయ్యారు. పర్యాటకులను మీది ఏ మతం అని, ఏ ధర్మం ఆచరిస్తారని అడిగి మరి ఉగ్రవాదులు ఘోరంగా, కిరాతకంగా చంపేశారన్నారు. బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వడానికో.. ఇక్కడికి రాలేదని ఆ కుటుంబాలకు, ఆ బిడ్డలకు తోడుగా ఉంటామని భరోసా కల్పించేందుకే వచ్చినట్లు పవన్ చెప్పారు. గత పదేళ్లుగా కాశ్మీర్లో ప్రశాంత వాతావరణం ఉందని ఈ భరోసాతోనే పర్యాటకులు కాశ్మీర్ అందాలను చూసేందుకు వెళుతున్నారని చెప్పారు. 1986-89 మధ్యకాలంలో సినిమా షూటింగ్ ల కోసం తను కాశ్మీర్ కు ప్రతి సంవత్సరం వెళ్లే వాడినని, అక్కడ పరిస్థితులు తనకు బాగా తెలుసు అన్నారు. మళ్లీ అలాంటి పరిస్థితిలే పునరావృతం కావడం చాలా బాధాకరంగా పవన్ అభిప్రాయపడ్డారు. ఈ ఘటనపై మంగళగిరిలో ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు పవన్ చెప్పారు. ఉగ్రవాదుల అణచివేతకు భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని పవన్ అన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ 28 మంది భారతీయులను ఎక్కడికక్కడ పేర్లు అడిగి మరీ ఉగ్రవాదులు పాశవికంగా చంపడం అత్యంత బాధాకరమైన విషయమన్నారు. పేర్లు అడిగి చంపడం మీ నాయకులకు చెప్పుకోండి, మీ ప్రధానమంత్రిగా చెప్పుకోండి అని దారుణంగా చంపడం పిరికిపందల చర్యగా మంత్రి ఆనం అన్నారు. ప్రపంచ దేశాలన్నీ నేడు భారతదేశం వైపు చూస్తున్నాయని, ఈ ఉగ్రవాద సంస్థలను అణిచివేయడానికి మేము తోడుగా ఉన్నామని చెప్పి అన్ని దేశాలు ఒక తాటిపైకొస్తున్నాయన్నారు. మన ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరు (ఒకరు విశాఖపట్నం నుంచి మరొకరు కావలి) నుంచే చనిపోవడం చాలా బాధాకరమైన విషయమన్నారు. మధుసూదన్ పార్థివ దేహం కావలికి వచ్చినప్పటి నుంచి జిల్లా యంత్రాంగం అంతా ఇక్కడే ఉందన్నారు. ప్రభుత్వం కూడా అన్ని రకాలుగా అండగా ఉంటుందని తెలియజేశారు. శాంతి సామరస్యానికి ప్రతిరూపమైన ఈ భారతదేశంలో ఇటువంటి దేశంలో ఈ ఉగ్రవాద చర్య హేయమైన చర్యగా మంత్రి ఆనం ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో ఇటువంటి ఘటనలనూ ఎవరు సమర్ధించరన్నారు. ఈ దురదృష్టకరమైన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారందరికీ కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా మేమున్నామంటూ భరోసా ఇస్తున్నాయని చెప్పారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన మధుసూదన్ కుటుంబం నెల్లూరులో మా పక్క వీధిలో ఉండే వారని, వారి కుటుంబంతో తమకు మంచి అనుబంధ ఉందని మంత్రి ఆనం చెప్పారు. మధుసూదన్ ను కోల్పోవడం తమ కుటుంబంలో వ్యక్తిని కోల్పోయినట్లుగా భావిస్తున్నట్లు మంత్రి చెప్పారు. మధుసూదన్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పది లక్షల రూపాయలు ప్రకటించినట్లు మంత్రి చెప్పారు. మధుసూదన్ కుటుంబ సభ్యులకు ఆత్మస్థైర్యాన్ని ప్రసాదించాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు మంత్రి ఆనం చెప్పారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఏప్రిల్ 22 దేశ చరిత్రలో ఒక చీకటి రోజుగా నిలిచిపోతుందన్నారు. దేశంలో సమర్ధవంతమైన నాయకత్వంలో గత పదేళ్లుగా జమ్మూ కాశ్మీర్ ప్రశాంతంగా ఉందని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ఉన్న జమ్మూ కాశ్మీర్లో మతం పేరుతో అత్యంత పాసవికంగా వ్యవహరించడం 145 భారతీయుల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. సమాచారం తెలిసిన కొన్ని గంటల్లోనే సౌదీ అరేబియా పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ వెంటనే తిరిగి వచ్చేసారని, హోం మంత్రి అమిత్ షా జమ్మూ కాశ్మీర్ పెల్లి పరిస్థితిని సమీక్షించారని సత్య కుమార్ చెప్పారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వాలు అండగా ఉంటాయని, వారి బిడ్డల ఉజ్వల భవిష్యత్తుకు సంపూర్ణ సహకారం అందిస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ కావలిలో ఇదొక బ్లాక్ డే గా ఎమ్మెల్యే అన్నారు. పేద కుటుంబం నుంచి ఉన్నతంగా ఎదిగి మంచి వ్యక్తిత్వం గల మధుసూదన్ మృతి చెందడం దురదృష్టకరమన్నారు. భార్య, బిడ్డల కళ్ళముందే ఇలాంటి ఘటన జరగడం.. వారి ఆవేదన, బాధ వర్ణనాతీతమన్నారు. భారతీయులందరూ దేశానికి మద్దతు పలకాలన్నారు. కులమత రాజకీయాలు పక్కన పెట్టి అందరం ఏకమవుదాం... ఉగ్రవాదులను అంతమొందిద్దామవి పిలుపునిచ్చారు. దేశ రక్షణ, భద్రత కోసం ప్రధాని నరేంద్ర మోడీ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా ప్రజలందరూ అండగా నిలబడుతామని చెప్పారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ ఇది పిరికిపందల చర్య అని చెప్పారు. ఈ కిరాతకు ఘటనకు సంబంధించి కనీసం పాకిస్తాన్ సరైన పద్ధతిలో సానుభూతి కూడా తెలపలేదని సోమిరెడ్డి మండిపడ్డారు. ఇలాంటి కిరాతకమైన ఘటనకు పాల్పడిన ఉగ్రవాదులను వదిలి ప్రసక్తే లేదని... భారత్ జోలికి వచ్చిన వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని సోమిరెడ్డి అన్నారు.

**కన్నీటి వీడ్కోలు మధ్య మధుసూదన్ అంతిమయాత్ర**

**- అంతిమయాత్రలో పాల్గొన్న మంత్రులు సత్య కుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్...:** కావలి ప్రజలు, బంధువులు, మిత్రులు వెంటరాగా మధుసూదన్ రావు అంతిమయాత్ర ఘనంగా నిర్వహించారు. మధుసూదన్ రావు అమర్ రహే అంటూ ప్రజలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కావలి పట్టణవాసికి కన్నీటితో వీడ్కోలు పలికారు. మంత్రులు సత్య కుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్ అంత్యక్రియల్లో పాల్గొని పాడెను మోశారు. జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణ కాంత్, ఆర్డీవో వంశీకృష్ణ, అధికారులు, పోలీసులు ఏర్పాట్లను పూర్తిస్థాయిలో పర్యవేక్షించారు.

## వి.ఎస్.యు వైస్ ఛాన్సలర్ బోధన, బోధేతర సిబ్బందితో సమావేశం

### ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహణపై చర్చ

**వెంకటాచలం, (పెన్ పవర్) ఏప్రిల్ 24**

ఈ నెల 30 తేది నుండి విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు , ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ (మహిళలు మరియు పురుషులు) టోర్నమెంట్ నిర్వహణ సందర్భంగా బోధన, బోధనేతర సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.






**ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ....** దేశవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల నుండి ప్రతినిధులు పాల్గొననున్న ఈ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్రీడా ప్రాంగణాల ఏర్పాట్లు, హాస్టల్ వసతులు, భద్రత, ఆరోగ్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. టోర్నమెంట్ విజయవంతం కాకపోతే విశ్వవిద్యాలయ ప్రతిష్ఠకు భంగం కలగనుందని, అందుకే ప్రణాళికాబద్ధంగా, సమయానుకూలంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది యాక్టివ్‌గా పాల్గొనాలని, క్రీడాకారులకు అతిథిగా కాక కుటుంబ సభ్యుల్లా ఆత్మీయత చూపించాలని ఆయన పేర్కొన్నారు.

**రిజిస్ట్రార్ డాక్టర్ కె సునీత మాట్లాడుతూ......** టోర్నమెంట్ సక్సెస్ కావాలంటే టీచింగ్ మరియు నాన్ టీచింగ్ సిబ్బందంతా ఏకతాటిపై నిలబడి, అంకితభావంతో పనిచేయాలని ప్రోత్సహించారు. అనంతరం జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోని పహల్గాం పర్యాటక ప్రాంతంలో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన కావలి పట్టణానికి చెందిన సాఫ్ట్ వేర్ ఇంజనీర్ సోమి శెట్టి మధుసూదన్ కి మౌనం పాటిస్తూ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సిహెచ్.విజయ, (స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ) డాక్టర్ సిహెచ్.వెంకట్రాయులు, (ఐక్యూ ఏ సి కోఆర్డినేటర్) ఆచార్య అందే ప్రసాద్, (డీన్ సి డి సి) డాక్టర్ ఎం.హుస్సేనయ్య (డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్) ఆచార్య జి.విజయానంద్ కుమార్ బాబు, (డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ మరియు మేనేజ్మెంట్) ఆచార్య సుజా ఎస్ నాయర్, (డి ఓ ఏ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్) డాక్టర్ ఎం.హనుమారెడ్డి, (పరీక్షల నియంత్రణ అధికారి) డాక్టర్ ఆర్. మధుమతి, (అదనపు పరీక్షల నియంత్రణ అధికారి) డాక్టర్ యన్ ఓ.గోపాల్ (ఎన్ ఎస్ ఎస్ సమన్వయకర్త) డాక్టర్ ఉదయ్ శంకర్ అల్లం, (జవహర్ భారతి డిగ్రీ కళాశాల కావలి) డాక్టర్ పి ప్రసాద్ రెడ్డి లెక్చరర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, (ఎస్ ఆర్.జె డిగ్రీ కళాశాల ఆత్మకూరు) శ్రీ ఎస్.వెంకటేశ్వర్లు లెక్చరర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్,(డిప్యూటీ రిజిస్టర్ డాక్టర్ సి ఎస్.సాయి ప్రసాద్ రెడ్డి, (సహాయక రిజిస్టర్) డాక్టర్ జి.సుజయ్ కుమార్, బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొనారు.

## టిడిపి నాయకుడు సోమవరపు సుబ్బారెడ్డి మృతితో ఒక ఆత్మీయుని కోల్పోయాను చేజర్ల

**బ్యూరో రిపోర్టర్ పెన్ పవర్ నెల్లూరు- ఏప్రిల్ 24**



తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, దుగ్గిశెట్టి కోటయ్య సత్రం మాజీ చైర్మన్ సోమవరపు సుబ్బారెడ్డి అనారోగ్య కారణంగా గురువారం కోవూరు కోనేటి కయ్యలలోని వారి నివాసంలో శివక్యం చెందారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర మాట్లాడుతూ సోమవరపు సుబ్బారెడ్డి తన ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా తెలుగుదేశం పార్టీ కొరకు నిత్యం పనిచేసేవారు అని వారు నిత్యం నా శ్రేయస్సు కోరుకునేవారు అన్నారు. వారి మృతితో తెలుగుదేశం పార్టీ నిబద్ధతతో పనిచేసే నాయకుణ్ణి కోల్పోయింది అని వారి మృతి తెలుగుదేశం పార్టీకి, వ్యక్తిగతం గా నాకు తీరని లోటు అన్నారు. వారి పవిత్ర ఆత్మ కు శాంతి చేకూర్చాలని,వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యం ప్రసాదించాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తూ,వారి మృతికి సంతాపం తెలియచేస్తున్నాను అని తెలిపారు.

## ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం





**కందుకూరు పెన్ పవర్,ఏప్రిల్ 24:**

గురువారం మండలంలోని కోవూరు గ్రామ సచివాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామసభ సర్పంచ్ ఆవుల మాధవరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాధవరావు మాట్లాడుతూ గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం దిశగా పల్లె ప్రగతి దేశానికి ప్రగతి. ప్రజాస్వామ్య చరిత్రలో పంచాయితీలకు ఒక ప్రత్యేక స్థానం. గ్రామ పంచాయితీ సక్రమ నిర్వహణ దేశానికే ప్రగతి. అభివృద్ధికి సూచిక అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహ, సచివాలయసిబ్బంది, నాయకులు రమణయ్య, మహీంద్రా,వెంకటేష్,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు పూర్వ విద్యార్థులు పలు వస్తువులు బహుకరణ



**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 24**

1973-74 సంవత్సరం కందుకూరు జిల్లా పరిషత్ హైస్కూల్ లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు, వారు చదువుకున్న స్కూల్ కు అహుజ కంపెనీ లేటెస్ట్ మోడల్ అంప్లిఫైర్, కార్డులెస్ మైక్ లు 2 రూ. 25,000 విలువ కలిగినవి బహుకరించారు. ఈ కార్యక్రమం లో హెడ్మాస్టర్ నరసింహారావు, ఉపాధ్యాయులు రమణయ్య , పెరుగు ప్రసాద్, గుడ్లూరి వెంకటేశ్వర రావు, ఇప్పగుంట శ్రీనిధి, ఉపాధ్యాయినులు సరస్వతి, ఉర్దూ టీచర్, 1973-74 పూర్వ విద్యార్థుల తరపున మంచిరాజు మురళీ, దొనవల్లి రమేష్, సంధాని బాషా, అక్కల ఉమామహేశ్వరరావు, ముచ్చెలి ఉమామహేశ్వరరావు, బొమ్మిశెట్టి కోటేశ్వరరావు, గోనుగుంట సుబ్రహ్మణ్యం, ఉరిమి వెంకట సుబ్బారావు, ఏకాంబరం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ ఫలితాలలో 588 మార్కులు సాధించిన సయ్యద్ గౌస్ బాషాకు అభినందనలు

**కొమరోలు తాసిల్దార్ కార్యాలయంలో ఏఎస్ఓగా పనిచేస్తున్న ఫరీదా బేగం కుమారుడు గౌస్ బాషా.**

**గిద్దలూరు లోని సూర్యనికేతన్ పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసిన సయ్యద్ గౌస్ బాషా.**

**గౌస్ బాషాను అభినందించిన కొమరోలు తాసిల్దార్ దేవరశెట్టి భాగ్యలక్ష్మి ,డిప్యూటీ తాసిల్దార్ వెంకటయ్య, కార్యాలయ సిబ్బంది.**

**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 24**

పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో సయ్యద్ గౌస్ బాషా 600 మార్కులకు 588 మార్కులు సాధించి పలువురితో అభినందనలు పొందుతున్నాడు. కొమరోలు తాసిల్దార్ కార్యాలయంలో ఏఎస్ఓగా డిప్యూటేషన్ పై పనిచేస్తున్న సయ్యద్ ఫరీదా బేగం సయ్యద్ ఖాదర్ వలీ ల కుమారుడు సయ్యద్ గౌస్ బాషా గిద్దలూరు లోని సూర్య నికేతన్ పాఠశాలలో చదువుతున్నాడు. ఈ ఏడాది మార్చి లో నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరై పరీక్షలు రాశాడు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు బుధవారం వెల్లడయ్యాయి. ఆ ఫలితాలలో సయ్యద్ గౌస్ బాషా 600 మార్కులకు 588 మార్కులు సాధించి టాపర్గా నిలిచాడు. అత్యధిక మార్కులు సాధించిన సయ్యద్ గౌస్ బాషాను తల్లిదండ్రులు ఫరీదా బేగం, ఖాదర్ వలి తో పాటు బంధుమిత్రులు అభినందించారు. కాగా కొమరోలు తాసిల్దారు దేవరశెట్టి భాగ్యలక్ష్మి, డిప్యూటీ తాసిల్దార్ వెంకటయ్య, జూనియర్ అసిస్టెంట్లు పెద్ద దేవనాయక్, రంగనాయకులు, శ్రీవిద్య ,మండల సర్వేయర్ పఠాన్ సిలార్ ఖాన్, కంప్యూటర్ ఆపరేటర్ ఉషారాణి ,ఎలక్షన్ డేటా ఆపరేటర్ రాజ్యలక్ష్మి తో పాటు వీఆర్వోలు, వీఆర్ఏలు అభినందించారు.



# ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం







**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 24**

మన దేశంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఏప్రిల్ 24న నిర్వహిస్తారు అని ఎంపీపీ ఇంటూరి సుశీల అన్నారు. గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక పాలనా వ్యవహారాలను సమర్ధవంతంగా నిర్వహించడంలో పంచాయతీ రాజ్ సంస్థలు కీలకంగా వ్యవహరిస్తాయి అని సుశీల పేర్కొన్నారు. జడ్పిటిసి తొట్టెంపూడి అనసూయ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధిని ప్రోత్సహించడంలో, సామాజిక సాధికారతలో వీటి పాత్రను ప్రజలకు తెలియజేయడం ముఖ్య ఉద్దేశం అని అన్నారు. భారత రాజ్యాంగంలోని 40వ నిబంధన పంచాయతీ రాజ్ సంస్థలను ఏర్పాటు చేయాలని పేర్కొంటోంది అని తెలిపారు. మన దేశంలో మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ అమల్లో ఉంది. దిగువ స్థాయి - గ్రామ పంచాయతీ,మధ్య/ బ్లాక్ స్థాయి - పంచాయతీ సమితి, ఉన్నత స్థాయి - జిల్లా పరిషత్ ఉన్నట్లు ఆమె తెలిపారు. పలుకూరు ఎంపీటీసీ స్వర్ణ పున్నయ్య మాట్లాడుతూ పీవీ నరసింహారావు ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థకు రాజ్యాంగ భద్రత కల్పించే లక్ష్యంతో 73వ రాజ్యాంగ సవరణ బిల్లును 1991, సెప్టెంబరు 16న పార్లమెంటులో ప్రవేశపెట్టింది అని అన్నారు. 1992, డిసెంబరు 22న దీనికి ఆమోదం లభించింది. ఈ బిల్లుకు దేశంలోని 17 రాష్ట్రాల శాసనసభలు అంగీకారం తెలిపాయి అని తెలిపారు. ఈ బిల్లుపై అప్పటి రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ 1993, ఏప్రిల్ 20నఆమోదముద్ర వేయడంతో 73వ రాజ్యాంగ సవరణ, చట్టం (1992)గా మారి 1993, ఏప్రిల్ 24 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. దీన్ని పురస్కరించుకుని ఏటా ఏప్రిల్ 24న 'జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం'గా జరుపుకోవాలని నాటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం 2010లో నిర్ణయించింది తెలిపారు. అంత ముందు కేక్ కట్ చేసి అధికారులను ప్రజాప్రతినిధులను శాలువాలతో సత్కరించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతు బజార్లో ఆదాయం ఫుల్... సౌకర్యాలు నిల్



**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 24**

రైతు బజార్లో ఆదాయం ఘనంగా ఉన్న సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని అటు వ్యాపారస్తులు, ఇటు వినియోగదారులు వాపోతున్నారు. రైతుబజారులో కొత్తగా వచ్చిన ఎస్టేట్ ఆఫీసర్ మార్కెట్ పీక్ అవర్స్ లోమార్కెట్ లో ఎప్పుడు ఉండడం లేదు అనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. వచ్చిన రోజూ మాత్రం, షాపులలో కూరగాయలు లోపలకు పెట్టుకోవాలి అని నోటీసులు ఇస్తూ అందరిని ఇబ్బందులకు గురి చేస్తున్నది అని పలువురు వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ లో పారిశుద్యం అధ్వాన్నం గా ఉంటున్నది. ఇటీవల స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సైతం రైతు బజార్లో పరిస్థితులు గమనించి మరుగుదొడ్లు, పారిశుధ్యం పై అసహనం వ్యక్తం చేశారు. అయినప్పటికీ అధికారుల తీరు లో ఎలాంటి మార్పు రాలేదు. వేసవిలో దాహం తీర్చుకునేందుకు ఆర్వో ప్లాంట్ కూడా వాడుకలో లేదు. మార్కెట్ కు నెలకు సుమారు లక్ష రూపాయలు ఆదాయం వస్తుంది. వీటిలో కొంత భాగం వెచ్చించి ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. ఎస్టేట్ ఆఫీసర్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు వెళ్తుందో ఎవ్వరికి అర్థం కాని పరిస్థితి నెలకొందని అంటున్నారు. రైతుబజారును ఎస్టేట్ ఆఫీసర్ కాకుండా సెక్యూరిటీ గార్డ్ లు నిర్వహించడం గమనార్హం. ఈ సెక్యూరిటీ గార్డ్ లు కూడా ఎప్పుడు మార్కెట్ లో అందుబాటులో ఉండరు అనే విమర్శలు ఉన్నాయి. ప్రశ్నించే వారిని పలు షరతులతో వేదించడం షరా మామూలు అయిపోయింది అనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కందుకూరు రైతుబజారు మీద దృష్టి పెట్టి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## మహిళలకు స్విమ్మింగ్ అవకాశం

**కమిషనర్ కొర్రపాటి అనూష**



**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 24**

కందుకూరు ఉప్పు చెరువు నందు పురపాలక సంఘం వారు ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ ఫుల్ నందు ఈనెల 28వ తేదీ నుంచి ప్రతిరోజు ఉదయం 6:30 నుండి 8 గంటల వరకు మహిళలు స్విమ్మింగ్ చేసుకొనుటకు అవకాశం కల్పిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ కొర్రపాటి అనూష తెలిపారు. అదేవిధంగా ఈత నేర్చుకునే ఆసక్తి గల మహిళలకు మాస్టర్ ట్రైని దాసరి లక్ష్మీ దుర్గ చే ట్రైనింగ్ ఇవ్వబడును. కావున ఈ సదవకాశాన్ని ఆసక్తిగల మహిళలందరూ మున్సిపల్ కార్యాలయము నందు కానీ స్విమ్మింగ్ పూల్ వద్ద కౌంటర్ నందు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె అనూష ఒక ప్రకటనలో తెలిపారు.

## పొదిలి బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా రమణ కిషోర్

**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 24**

పొదిలి బాగా అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది గురువారం నాడు స్థానిక సివిల్ జడ్జి కోర్టుకు సంబంధించిన న్యాయవాదులు సమావేశం జరిపి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు అధ్యక్షులుగా ఎంవి రమణ కిషోర్, కార్యదర్శిగా ముల్లా ఖాదర్ వ లి, ఉపాధ్యక్షులుగా ఎం రాంబాబు, జి పెద్దయ్య, సహాయ కార్యదర్శిగా యు శ్రీహర్ష చక్రవర్తి, కోశాధికారిగా షేక్ జిలాని, లైబ్రేరియన్ గా జి సుజాత, స్పోర్ట్స్ మరియు కల్చరల్ సెక్రటరీగా ఎం నాయబ్ రసూల్, నూతన బార్ మెంబర్ గా దేవి మహేష్ బాబు, మహిళా ప్రతినిధిగా ఈ జ్ఞాన కుమారి లను ఎన్నుకున్నారు ఎన్నిక కార్యక్రమాన్ని సీనియర్ బార్ అసోసియేషన్ సభ్యులు శ్రీపతి శ్రీనివాసరావు, ఉడుముల లక్ష్మీరెడ్డి, జి సుబ్బారావు, బి సురేష్ బాబు లు పరిశీలించారు.



## పంచాయతీరాజ్ వ్యవస్థ తోనే గ్రామ స్వరాజ్యం సాధ్యం







**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 24**

జాతిపిత మహాత్మా గాంధీ కలలు అన్న గ్రామ స్వరాజ్యం పంచాయతీరాజ్ వ్యవస్థ తోనే సాధ్యమవుతున్నదని కొమరోలు గ్రామపంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దేవరశెట్టి బ్రహ్మయ్య పేర్కొన్నారు. జాతీయ పంచాయతీల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కొమరోలు గ్రామ సచివాలయాల ప్రాంగణంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బ్రహ్మయ్య అధ్యక్షత వహించగా, కొమరోలు వార్డు మెంబర్ చంద్రమోహన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీ ,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బ్రహ్మయ్య మాట్లాడుతూ ,మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం పంచాయతీరాజ్ వ్యవస్థ తోనే సాధ్యమవుతున్నదని అన్నారు. నేడు గ్రామాలు పట్టణాలకు తీసిపోని విధంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయన్నారు. గ్రామాలే దేశ ప్రగతికి వెన్నెముకగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఆ సందర్భంగా కొమరోలు గ్రామపంచాయతీ లో 2024- 25 ఆర్థిక సంవత్సర ఖర్చులు జమ వివరాలు వివరించారు.15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు వాటి వినియోగం తదితర అంశాలను వివరించారు .73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థకు లభించిన మౌలిక సదుపాయాలు ,పథకాల గురించి ఆయన వివరించారు ఆ కార్యక్రమంలో గ్రామ సచివాలయాల కార్యదర్శి జనార్దన్ రెడ్డి ,శ్రీనివాసులు ,కొమరోలు మండల పరిషత్ కంప్యూటర్ ఆపరేటర్ షేక్ షాను ,మూడు సచివాలయాల సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

# కొమరోలు మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

**జాతిపిత మహాత్మా గాంధీ ,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించిన అధికారులు ప్రజాప్రతినిధులు.**

**పంచాయతీరాజ్ వ్యవస్థను రూపొందించి బలోపేతం చేసిన మహనీయుల సేవలు చిరస్మరణీయం.**

**కొమరోలు ఎంపీడీవో సయ్యద్ మస్తాన్ వలి.**

**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 24**

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకొని గురువారం కొమరోలు లోని మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు .ఆ కార్యక్రమానికి ఎంపీడీవో సయ్యద్ మస్తాన్ వలి అధ్యక్షత వహించారు. ఆ సందర్భంగా ఎంపీడీవో మస్తాన్ వలి,తాటిచెర్ల ఎంపిటిసి సభ్యులు కామూరి శ్రీనివాసరెడ్డి ,కార్యాలయ సిబ్బంది మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ, పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పడిన తర్వాత గ్రామాలు సర్వతో ముఖాభివృద్ధి సాధిస్తున్నాయని అన్నారు .జాతిపిత మహాత్మా గాంధీ కలరుగన్న గ్రామ స్వరాజ్యం పంచాయతీరాజ్ వ్యవస్థతో



అమలు జరుగుతున్నదని తెలిపారు .పంచాయతీరాజ్ వ్యవస్థను రూపొందించి ఆ వ్యవస్థ బలోపేతం అయ్యేందుకు కృషిచేసిన మహనీయుల సేవలు చిరస్మరణీయమని ఆయన పేర్కొన్నారు. దేశానికి గ్రామాలు పట్టుకొమ్మలని, అందువల్లనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నాయని, తద్వారా గ్రామాలలో మెరుగైన మౌలిక సదుపాయాలు ఏర్పడి ప్రజలు సుఖశాంతులతో, పాడిపంటలతో జీవిస్తున్నారని తెలిపారు. ఒకప్పుడు గ్రామాల ప్రజలు పట్టణాలకు వలస వెళ్లే వారని ,అయితే పంచాయతీ వ్యవస్థ బలోపేతమై, గ్రామాలలో మెరుగైన సౌకర్యాలు ఏర్పడిన తర్వాత పట్టణ ప్రజలు గ్రామాల వైపు వలసలు వచ్చేందుకు ఉత్సాహం చూపుతున్నారని ఆయన తెలిపారు .ఆ కార్యక్రమంలో కొమరోలు మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనాథ్, టైపిస్టు శేఖర్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు ,ఆఫీస్ సవార్డినేటర్ శ్రీను, ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

## పేట జనసేన ఆధ్వర్యంలో నిరసన దీక్ష



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 24:**

జమ్మూ కాశ్మీర్ లోని పెహల్గామ్ ప్రాంతంలో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన 28మంది భారత పౌరులకు ఘన నివాళిగా జనసేన పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు సంతాపదినాలలో బాగంగా జనసేన కన్నీటినివాళి అనే కార్యక్రమం ద్వారా ఉగ్రదాడిలో మరణించిన భారత పౌరుల ఆత్మకు శాంతి కలగాలని చిలకలూరిపేట నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయం దగ్గర నిరసన దీక్ష చేపట్టడం జరిగింది... ఈ కార్యక్రమంలో పాల్గొన్న జనసేనపపార్టీ సమన్వయకర్త తోట రాజా రమేష్ మాట్లాడుతూ అభం శుభం తెలియని భారత పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తూ దేశం మొత్తం ఈ సంఘటనను ముక్తకంఠంతో ఖండించి ఉగ్రవాద అంతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలనిఅన్నారు.జమ్మూ కశ్మీర్ లో గతంలో ఎన్నడూ లేని విధంగా శాంతియుతంగా ఎన్నికలు జరిగాయని దీనితోపాటు ఆ రాష్ట్ర%ళి% పర్యాటకరంగం లో కూడా అభివృద్ధి చెందుతుందని గ్రహించిన పాక్ ఉగ్రవాద సంస్థలే పాకిస్తాన్ సహకారంతో ఈ దుచ్చర్యకు పాల్పడ్డాయని అన్నారు. చనిపోయిన 28 మంది ఆత్మలకు శాంతి కలగాలని, వారి కుటుంబాలకు జనసేన పార్టీ తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లాకమిటి సభ్యులు, పట్టణ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, మండల కమిటీ సభ్యులు,వీరమహిళలు, జనసేన నాయకులు జన సైనికులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## మేము సరిగా కన్ను తెరిస్తే ఆ కంటి వెలుగులో చచ్చిపోతారు ఉగ్రముఖల్లారా

**బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ**







**పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఏప్రిల్ 24:**

శాంతియుత ర్యాలీలో పాల్గొన్న... వేగేశన నరేంద్ర వర్మ అన్నదమ్ములుగా ఉన్న మమ్ములను విడదీయాలని చూస్తే సహించేది లేదుజమ్మూ కాశ్మీర్ పహల్గామ్‌లో ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండించిన నరేంద్ర వర్మ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలిపిన వేగేశన ఈ దాడిలో మరణించిన వాళ్లలో తెలుగువారుండటం అత్యంత విచారకరం ముష్కరమూకలు ఎన్నిదాడులు చేసినా భారతీయుల ఐక్యత, ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు బాపట్ల..జమ్ముాకాశ్మీర్ లోని పహల్గామ్ లో పర్యాటకులపై ఉగ్రవాదుల పాశవిక దాడిని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ఖండించారు. ముష్కరమూకల దాడిలో అమాయకులైన 28 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోవడం.. వారిలో తెలుగురాష్ట్రాలకు చెందిన వారు కూడా ఉండటం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే ఘటనలో గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పర్యాటక ప్రదేశంలో నిరాయుధలైన, సంబంధంలేని అమాయకులైన టూరిస్టులపై ఉగ్రవాదులు కాల్పులు జరపటం హేయమైన చర్య అని నరేంద్ర వర్మ అభివర్ణించారు. టెర్రరిస్టుల విషయంలో కేంద్ర ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాలని.. ఈ ఘటన దాడిలో పాల్గొన్నవారిని, దాని వెనుక ఉన్న మాస్టర్ మైండ్స్‌ను గుర్తించి కఠినంగా శిక్షించాలని.. తద్వారా భారత్ పై దాడులు చేయాలనుకున్నవారికి గట్టి హెచ్చరికలు జారీ చేయాలని ఆయన కోరారు. మరీ ముఖ్యంగా భూతల స్వర్గాన్ని తలపించే కాశ్మీర్‌లో రక్తపాతం సృష్టిస్తున్న పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలను కూకటి వేళ్లతో సహా పెకిలించివేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పాకిస్తాన్ ప్రేరేపిత ముష్కరమూకలు ఎన్నిదాడులు చేసినా భారతీయుల ఐక్యత, ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరని.. ఈ సమయంలో భారతీయులంతా ఏకమై ఉగ్రవాదానికి వ్యతిరేకంగా గళమెత్తాలని వేగేశన తెలియజేసేరు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన కావూరి శ్రీనివాస్ రెడ్డి ఆంధ్రీయ కర్లపాలెం మాజీ ఎంపిటిసి బాజీ కర్లపాలెం మండల పార్టీ అధ్యక్షులు భూపతిరావు శివ కాగిత నాగభూషణం అమ్మ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నెల్లూరు జిల్లా కావలిలో కాశ్మీర్ ఉగ్రదాడిలో చనిపోయిన సోమిశెట్టి మసూదన్ రావుని భౌతిక్యానికి నివాళులర్పించి వారి కుటుంబానికి భరోసాని కల్పించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు.





**కావలి పెన్ పవర్ ఏప్రిల్ 24:**

భారతదేశంలో ఉగ్రవాదులు ఎక్కడున్నా నిర్దాక్షిణ్యంగా ఏరివేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గురువారం కావలి పట్టణంలో ఉగ్రదాడిలో చనిపోయిన మధుసూదన్ కుటుంబాన్ని పరామర్శిస్తూ తెలిపారు. కాశ్మీర్ పహల్గాం ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన కావలి వాసి మధుసూదన్ భౌతికకాయానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఆర్టీసీ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణ కాంత్, పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు పుష్పగుచ్చాలతో నివాళులర్పించారు. గురువారం కావలిలోని మధుసూదన్ స్వగృహానికి చేరుకున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. సోమిశెట్టి మధుసూదన్ రావు భౌతిక కాయం వద్ద శోకతప్త హృదయాలతో ఘన నివాళులర్పించారు. మధుసూదన్ భార్య, పిల్లలతో ఉగ్రవాదుల దాడి విషయాలను అడిగి తెలుసుకునివారు ఆ సమయంలో అనుభవించిన మానసిక క్షోభ, దయనీయ పరిస్థితుల పట్ల ఆవేదనతో చలింపోయారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, ఇది అత్యంత హృదయ విదారక సంఘటన అని, భారతదేశం దీనిని మరచిపోదన్నారు. బాధిత కుటుంబ సభ్యుల బాధ, వారు అనుభవిస్తున్న మానసిక క్షోభ మాటల్లో చెప్పలేనిదిగా పవన్ భావోద్వేగంతో మాట్లాడారు. సంఘటనను తలుచుకుంటుంటే తన కడుపు రగిలిపోతుందని ఆవేదనకు గురయ్యారు. పర్యాటకులను మీది ఏ మతం అని, ఏ ధర్మం ఆచరిస్తారని అడిగి మరి ఉగ్రవాదులు ఘోరంగా, కిరాతకంగా చంపేశారన్నారు. బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వడానికో.. ఇక్కడికి రాలేదని ఆ కుటుంబాలకు, ఆ బిడ్డలకు తోడుగా ఉంటామని భరోసా కల్పించేందుకే వచ్చినట్లు పవన్ చెప్పారు. గత పదేళ్లుగా కాశ్మీర్లో ప్రశాంత వాతావరణం ఉందని, ఈ భరోసాతోనే పర్యాటకులు కాశ్మీర్ అందాలను చూసేందుకు వెళుతున్నారని చెప్పారు. 1986-89 మధ్యకాలంలో సినిమా షూటింగ్ ల కోసం తను కాశ్మీర్ కు ప్రతి సంవత్సరం వెళ్లే వాడినని, అక్కడ పరిస్థితులు తనకు బాగా తెలుసు అన్నారు. మళ్లీ అలాంటి పరిస్థితిలే పునరావృతం కావడం చాలా బాధాకరం అని పవన్ అభిప్రాయపడ్డారు. ఈ ఘటనపై మంగళగిరిలో ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు పవన్ చెప్పారు. ఉగ్రవాదుల అణచివేతకు భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని పవన్ అన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ,28 మంది భారతీయులను ఎక్కడికక్కడ పేర్లు అడిగి మరీ ఉగ్రవాదులు పాశవికంగా చంపడం అత్యంత బాధాకరమైన విషయమన్నారు. పేర్లు అడిగి చంపడం మీ నాయకులకు చెప్పుకోండి, మీ ప్రధానమంత్రిగా చెప్పుకోండి అని దారుణంగా చంపడం పిరికిపందల చర్యగా మంత్రి ఆనం అన్నారు. ప్రపంచ దేశాలన్నీ నేడు భారతదేశం వైపు చూస్తున్నాయని, ఈ ఉగ్రవాద సంస్థలను అణిచివేయడానికి మేము తోడుగా ఉన్నామని చెప్పి అన్ని దేశాలు ఒక తాటిపైకొస్తున్నాయన్నారు. మన ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరు (ఒకరు విశాఖపట్నం నుంచి మరొకరు కావలి) నుంచే చనిపోవడం చాలా బాధాకరమైన విషయమన్నారు. మధుసూదన్ పార్థివ దేహం కావలికి వచ్చినప్పటి నుంచి జిల్లా యంత్రాంగం అంతా ఇక్కడే ఉందన్నారు. ప్రభుత్వం కూడా అన్ని రకాలుగా అండగా ఉంటుందని తెలియజేశారు. శాంతి సామరస్యానికి ప్రతిరూపమైన ఈ భారతదేశంలో ఇటువంటి దేశంలో ఈ ఉగ్రవాద చర్య హేయమైన చర్యగా మంత్రి ఆనం ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో ఇటువంటి ఘటనలనూ ఎవరు సమర్ధించరన్నారు. ఈ దురదృష్టకరమైన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారందరికీ కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా మేమున్నామంటూ భరోసా ఇస్తున్నాయని చెప్పారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన మధుసూదన్ కుటుంబం నెల్లూరులో మా పక్క వీధిలో ఉండే వారని, వారి కుటుంబంతో తమకు మంచి అనుబంధ ఉందని మంత్రి ఆనం చెప్పారు. మధుసూదన్ ను కోల్పోవడం తమ కుటుంబంలో వ్యక్తిని కోల్పోయినట్లుగా భావిస్తున్నట్లు మంత్రి చెప్పారు. మధుసూదన్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పది లక్షల రూపాయలు ప్రకటించినట్లు మంత్రి చెప్పారు. మధుసూదన్







కుటుంబ సభ్యులకు ఆత్మస్థైర్యాన్ని ప్రసాదించాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు మంత్రి ఆనం తెలిపారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ,ఏప్రిల్ 22 దేశ చరిత్రలో ఒక చీకటి రోజుగా నిలిచిపోతుందన్నారు. దేశంలో సమర్థవంతమైన నాయకత్వంలో గత పదేళ్లుగా జమ్మూ కాశ్మీర్ ప్రశాంతంగా ఉందని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ఉన్న జమ్మూ కాశ్మీర్లో మతం పేరుతో అత్యంత పాసవికంగా వ్యవహరించడం 145 భారతీయుల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. సమాచారం తెలిసిన కొన్ని గంటల్లోనే సౌదీ అరేబియా పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ వెంటనే తిరిగి వచ్చేసారని, హోం మంత్రి అమిత్ షా జమ్మూ కాశ్మీర్ పెల్లి పరిస్థితిని సమీక్షించారని సత్య కుమార్ చెప్పారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వాలు అండగా ఉంటాయని, వారి బిడ్డల ఉజ్వల భవిష్యత్తుకు సంపూర్ణ సహకారం అందిస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు.కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ, కావలిలో ఇదొక బ్లాక్ డే గా ఎమ్మెల్యే అన్నారు. పేద కుటుంబం నుంచి ఉన్నతంగా ఎదిగి మంచి వ్యక్తిత్వం గల మధుసూదన్ మృతి చెందడం దురదృష్టకరమన్నారు. భార్య, బిడ్డల





కళ్ళముందే ఇలాంటి ఘటన జరగడం,వారి ఆవేదన, బాధ వర్ణనాతీతమన్నారు భారతీయులందరూ దేశానికి మద్దతు పలకాలన్నారు. కుల,మత, రాజకీయాలు పక్కన పెట్టి అందరం ఏకతాటి మీద నడుద్దాం. ఉగ్రవాదులను అంతమొందిద్దామవి పిలుపునిచ్చారు. దేశ రక్షణ, భద్రత కోసం ప్రధాని నరేంద్ర మోడీ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా ప్రజలందరూ అండగా నిలబడుతామని తెలిపారు.సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ ఇది పిరికిపందల చర్య అని చెప్పారు. ఈ కిరాతకు ఘటనకు సంబంధించి కనీసం పాకిస్తాన్ సరైన పద్ధతిలో సానుభూతి కూడా తెలపలేదని సోమిరెడ్డి మండిపడ్డారు. ఇలాంటి కిరాతకమైన ఘటనకు పాల్పడిన ఉగ్రవాదులను వదిలి ప్రసక్తే లేదనిభారత్ జోలికి వచ్చిన వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని సోమిరెడ్డి అన్నారు.కన్నీటి వీడ్కోలు మధ్య మధుసూదన్ అంతిమయాత్రలో పాల్గొన్న మంత్రులు సత్య కుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్ కావలి ప్రజలు, బంధువులు, మిత్రులు వెంటరాగా మధుసూదన్ రావు అంతిమయాత్ర ఘనంగా నిర్వహించారు. మధుసూదన్ రావు అమర్ రహే అంటూ ప్రజలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కావలి పట్టణవాసికి అంతిమ కన్నీటితో వీడ్కోలు పలికారు. మంత్రులు సత్య కుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్ అంత్యక్రియల్లో పాల్గొని భౌతిక కాయాన్ని మోయడం జరిగింది ఈ కార్యక్రమం అంతటినీ. జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణ కాంత్, ఆర్టీవో వంశీకృష్ణ, అధికారులు, పోలీసులు ఏర్పాట్లను పూర్తిస్థాయిలో పర్యవేక్షించారు.

# ఉగ్రదాడి పిరికిపంద చర్య: సోమిరెడ్డి



**వెంకటాచలం, (పెన్ పవర్) ఏప్రిల్ 24**

కాశ్మీర్ లో ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన కావలి వాసి సోమిశెట్టి మధుసూదన్ భౌతికకాయానికి మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, సత్యకుమార్ యాదవ్ తదితరులతో కలిసి నివాళులర్పించిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి. బాధిత కుటుంబసభ్యులకు పరామర్శ. సోమిరెడ్డి మాట్లాడుతూ......కాశ్మీరులో ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య. మతం పేరు అడిగి చంపేయడం దుర్మార్గం. ముష్కరుల చర్యల కారణంగా ఇప్పుడు కాశ్మీర్ లో ఏ మతస్థులు ఆర్థికంగా దెబ్బతిమబోతున్నారు. ఉగ్రవాదులు కానీ వారిని ప్రోత్సహించే సంస్థలు, దేశానికి ధైర్యముంటే నేరుగా వస్తే ఎదుర్కొనే సత్తా భారత్ కు ఉంది. భార్యాబిడ్డలతో విహారానికి వచ్చిన వారిని మతం, దేశం పేరు అడిగి చంపేసే పిరికి వాళ్లను ఎప్పుడూ చూడలేదు. మతాలకు అతీతంగా ప్రపంచమంతా ఈ ఘటనను ఖండిస్తోంది. మనుషులను చంపేసి మోదీకి చెప్పుకోండని చెప్పిన ముష్కరులు అసలు మనుషులేనా..వారిది మానవజన్మేనా. భారతదేశం జోలికి వచ్చినోళ్లను ప్రధాన నరేంద్రమోదీ ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టరు..పాపాత్ములు ఫలితం అనుభవింక తప్పదు. కనీసం చనిపోయిన వారికి సానుభూతిని కూడా చెప్పాల్సిన రీతిలో పాకిస్థాన్ చెప్పలేకపోయింది. కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లిన సోమిశెట్టి మధుసూదన్, చంద్రమౌళితో పాటు పలువురు ఉగ్రదాడికి బలైపోవడం బాధాకరం. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నానన్న సోమిరెడ్డి.





# స్మశానమా? చెరువు తవ్వేద్దాం?

## ఇదీ కృత్తివెన్ను మారాజుల భూదాహం

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, ఏప్రిల్, 25:** మారాజులు.. దళితుల స్మశానాలనూ వదలట్లేదు. వందల ఎకరాల్లో చెరువులు తవ్వేస్తూ.. బడుగు జీవుల తాత ముత్తాల జ్ఞాపకాలనూ తుడిచేస్తున్నారు. ఇది ఎక్కడో కాదు.. కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలంలోనే ఈ అరాచకం చోటు చేసుకుంది. కృత్తివెన్ను మండలం నిడమర్రు గ్రామపంచాయతీ నిడమర్రు దళితవాడ కు చెందిన స్మశాన వాటికనూ చెరువుగా మార్చేస్తుంటే.. తల్లడిల్లిన దళిత పిల్లలు కృత్తివెన్ను తాహసీల్దారును కలిసి .. తమ స్మశానాన్ని కాపాడమని వేడుకున్నారు. నిడమర్రు దళిత వాడకు చెందిన స్మశాన వాటికలో కిరణ్ రాజు అనే గలీజుదారుడు చెరువుగా మార్చేస్తున్నాడు. అదే మని ప్రశ్నించగా మీ పెద్దలు మాకు అప్పజెప్పిన భూమి ఇది, స్మశాన వాటిక కాదు, లీజుగా మాకు ఇచ్చిన భూమి అంటూ హూంకరించాడు. ఇక దళిత యువకులు తట్టుకోలేక కృత్తివెన్ను తాహసీల్దార్ కు ఫిర్యాదు చేశారు. తమ పూర్వీకుల నుంచి స్మశానంగా వినియోగిస్తున్న ఈ భూమిని ఈ మారాజులు కొల్లగొడుతున్నారని, చెరువులుగా మారుస్తున్నారని, మా స్మశానాన్ని కాపాడండి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మా ఆర్డీవో మాత.. ఒక్కసారి నిడమర్రులో పర్యటించు తల్లీ. ఇక్కడ జరుగుతున్న ఘోరాలను వీక్షించి.. తగు చర్య తీసుకో తల్లీ అంటూ కృత్తివెన్ను దళితులు వాపోతున్నారు.

పెన్ పవర్
గుంటూరు । బాపట్ల । పల్నాడు

# పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న రూరల్ పోలీసులు

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 24:** చిలకలూరిపేట : మధ్యాహ్నం మూడుగంటల సమయంలో బొప్పూడి గ్రామ శివారులలో నలుగురు వ్యక్తులు పేకాట (లోపల బయట) ఆడుతుండగా పేట రూరల్ ఎస్సై అనిల్ కుమార్ ,మహబూబ్ సుభాని, వారి సిబ్బంది సహాయంతో వారిని పట్టుకుని వారి వద్ద నుండి 25 వేల రూపాయల నగదును 52 పేక ముక్కలను స్వాధీనపరుచుకొని వారి పై కేసు నమోదు చేయడమైనది.



# ప్రకృతి వ్యవసాయం తోనే ఆరోగ్యకరమైనటువంటి పంటలు

**భూమిలో పోషక విలువలు పెంచేందుకు 18 రకాల విత్తనాలు విత్తుకోవాలి - డిపిఎం వాణి శ్రీ**





**పెన్ పవర్, ఏప్రిల్ 24,అద్దంకి**

ప్రకృతి వ్యవసాయం తోనే ఆరోగ్యకరమైనటువంటి పంటలు పందించుకోవచ్చని, భూమిలో పోషక విలువలు పెంచేందుకు 18 రకాల విత్తనాలు విత్తుకోవాలని డిపిఎం వాణి శ్రీ అన్నారు. గురువారం నియోజకవర్గం లోని సంతమాగులూరు మండలం కొమ్మలపాడు యూనిట్, సంతమాగులూరు యూనిట్, ఏల్చూర్ యూనిట్లలోని ప్రకృతి వ్యవసాయం సంబంధించి రైతుసేవా కేంద్రాలలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం ముందు వేసవి దుక్కులలో పీఎండిఎస్ కిడ్స్ ను తయారు కి సంబంధించి రైతుల నుండి విత్తనాలు విత్తనసేవా కేంద్రాల నుండి విత్తనాలను సేకరించి 10 కేజీలకు కిడ్స్ లను మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన ఐ సి ఆర్ పి లు తయారీ కి సిద్ధం చేయడం జరిగిందన్నారు . ఈ కార్యక్రమానికి జిల్లా ప్రాజెక్టు మానిటరింగ్ అధికారి వాణిశ్రీ అడిషనల్ డిపిఎం మోహన్ హాజరైనారు. జిల్లా ప్రాజెక్టు మానిటరింగ్ అధికారి వాణిశ్రీ మాట్లాడుతూ వేసవిలో ఎండ ఉష్ణోగ్రతను తట్టుకునే విధంగా భూమిని 18 రకాల విత్తనాలను భూమిపై విత్తి మొలకెత్తిన తర్వాత భూమిని ఈ ఎండ తీవ్రత నుండికప్పి ఉంచడం వల్ల భూమిలో ఉన్నటువంటి సూక్ష్మ పోషకాలు చనిపోకుండా ఉంటాయన్నారు. ఇంకా వృద్ధి చెందే విధంగా ఈ 18 రకాల విత్తనాలు పనిచేస్తాయన్నారు. అంతేకాకుండా రసాయినిక రహితమైనటువంటి కంపోస్టు ఎరువులు వేయకుండా ఆరోగ్యకరమైనటువంటి పంటను పండే విధంగా ఈ పీఎండీఎస్ కిడ్స్ ఉపయోగపడతాయని రైతులు 18 రకాల విత్తనాలు వేసి భూమిని సారవంతమైన పోషక విలువలు కలిగినటువంటి భూమిగా తయారు చేసుకోవచ్చని తెలిపారు. దీనిని ప్రతి రైతు వేసవిలో విత్తుకొని భూమిలో భూసారని పెంచాలని పోషక విలువలను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేచురల్ ఫర్ మీ చందన మాస్టర్ ట్రైనర్ శిరీష, ఎల్ టి బాజీ వెంకటలక్ష్మి, వెంకటరత్నం, నాగూర్ వలి, వీరారెడ్డి, ఐ సి ఆర్ పి లు, తదితరులు పాల్గొన్నారు.

# బొప్పూడి ప్రసన్నాంజనేయ స్వామిని దర్శించుకున్న మాజీమంత్రి ప్రత్తిపాటి

**భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని గ్రామస్తులు, ఆలయనిర్వాహకులకు సూచించిన ప్రత్తిపాటి**

**సాంస్కృతిక కార్యక్రమాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని పోలీస్ వారిని ఆదేశించిన ప్రత్తిపాటి**










**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 24:** మండలంలోని బొప్పూడిలో నేడు ప్రారంభమైన శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి 42వ వార్షికోత్సవం, తిరునాళ్లలో మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. గురువారం ఉదయం స్వామివారిని దర్శించుకున్న ప్రత్తిపాటి, ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొని అర్చకుల ఆశీర్వచనం తీసుకున్నారు. స్వామివారు చాలా మహిమగలవాడని, ఆంజనేయుని నమ్ముకున్నవారికి ఎలాంటి బాధలు, కష్టాలు ఉండవని ప్రత్తిపాటి తెలిపారు. గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులని అడిగి తిరునాళ్ల ఏర్పాట్ల గురించి తెలుసుకున్న ప్రత్తిపాటి, భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్నిజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తిరునాళ్లలో భాగంగా ఏర్పాటయ్యే ప్రభలు, వాటివద్ద జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన బందోబస్తు ఏర్పాటుచేయాలని ప్రత్తిపాటి స్థానిక పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజా రమేష్, టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, అంబటి సొంబాబు, గుంటూ కోటేశ్వరరావు, కందుల రమణ, గుంటూ సుబ్బారావు, గట్టినేని సాయి, వలేటి హిమామంతరావు, తుపాకుల అప్పారావు, పద్మ, అనితా భాయి తదితరులున్నారు.

# జర్నలిజానికి సంకెళ్లు వేయలేరు- ఏపీయూడబ్ల్యూజే

## కృష్ణాజిల్లా కన్వీనర్ రమేష్ బాబు సాక్షి కార్యాలయం పై దాడిని ఖండించిన కన్వీనర్



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, మచిలీపట్నం, ఏప్రిల్, 25**

కృష్ణాజిల్లా మచిలీపట్నం నిజాలను నిగ్గు తేలుస్తూ ప్రభుత్వం చేస్తున్న అవినీతి అక్రమాలను ఎండగడుతూ పాత్రికేయులు ప్రచురిస్తున్న కథనాలను ప్రతిఘటిస్తూ అధికార పార్టీ నాయకులు జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) కృష్ణా జిల్లా కన్వీనర్ చలమలశెట్టి రమేష్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కుట్రలను ప్రజలకు తెలియజేస్తూ వార్తలు రాసే జర్నలిస్టులపై దాడులకు పాల్పడుతూ జర్నలిజానికి సంకెళ్లు వేయాలనుకోవడం అవివేకమన్నారు. జర్నలిస్టులపై దాడులు జరుగుతున్న కొలది పాత్రికేయ సోదరులు తమ కలానికి, కథనాలకు మరింత పదును పెడతారే తప్ప భయపడి పరుగులు పెట్టరనే విషయాన్ని ప్రభుత్వాలు తెలుసుకోవాలన్నారు. ఏలూరు సాక్షి కార్యాలయం పై చింతమనేని ప్రభాకర్ అతని అనుచరులు చేసిన దాడిని ఖండిస్తూ కృష్ణాజిల్లా ఏపీయూడబ్ల్యూజే కన్వీనర్ చలమలశెట్టి రమేష్ బాబు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే యూనియన్ తరపున కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఆ ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రజలకు తెలియజేసే బాధ్యత పాత్రికేయులపై ఉంటుందన్నారు. కథనాల్లో వాస్తవాలు లేకుంటే యాజమాన్యాలకు ఫిర్యాదులు చేయలే తప్ప ఇలా దాడులకు పాల్పడి భయభ్రాంతులకు గురి చేయాలనుకోవడం సహేతుకం కాదన్నారు. సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి పై అక్రమ కేసు నమోదు, ఏలూరులో సాక్షి కార్యాలయం పై దాడి చూస్తుంటే ఉద్దేశపూర్వకంగానే జర్నలిస్టులను భయపెట్టే పనులకు ప్రభుత్వం పూనుకుంటుందని అర్థమవుతుందన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న జర్నలిస్టులు ఇలాంటి బెదిరింపులకు భయపడే ప్రసక్తే ఉండదన్నారు. పాత్రికేయులపై ప్రభుత్వాలు దాడులు చేయడం, భయభ్రాంతులకు గురి చేయాలనుకోవడం అవివేకమన్నారు. అధికారంలో ఉండే ఏ ప్రభుత్వాలు అయినా ఇలాంటి చర్యలను మానుకోకుంటే పాత్రికేయ సంఘాల తరపున పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధపడటం తధ్యమన్నారు.

# ఏపీ బీజేపీ ఛీఫ్ కోసం పోటీ..

**విజయవాడ , ఏప్రిల్ 24, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్ష పదవికి భారీ స్థాయిలో పోటీ నెలకొంది. కూటమి అధికారంలో ఉంది. కేంద్ర ప్రభుత్వంలోనూ ఏపీ ఇంపార్టెన్స్ పెరిగింది. అమరావతి, పోలవరం నిర్మాణాలకు ప్రాధాన్యత దక్కుతోంది. ఈ కారణాలతో ఏపీ బీజేపీ అధ్యక్ష పదవి గతంలో కంటే ప్రాముఖ్యమైందిగా మారిపోయింది. అందుకే ఈసారి ఎన్నడూ లేనంతగా ఆ పదవి కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. రాష్ట్రంలో ,కేంద్రంలో తమకున్న పలుకుబడి దృష్ట్యా ఎవరికీ వారు తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పటికే రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలుగా ఉన్న దగ్గుబాటి పురందేశ్వరికే మరోసారి ఆ బాధ్యతలు అప్పగించే ఆలోచనలో బీజేపీ అధిష్ఠానం ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. కేంద్రంలో కీలక పదవికి ఆమెను తీసుకు వెళ్లాలని భావించినా 2024 ఎన్నికల సమయంలో కీలకంగా ఆమె వ్యవహరించడం ఎన్టీఆర్ కుమార్తె అనే సెంటిమెంట్ ప్రజల్లో ఉండడం టిడిపి నేతలు, జన సైనికులు కూడా ఆమెతో గౌరవంగా ఉండడం పార్టీకి కలిసి వస్తుందని కేంద్ర స్థాయి నేతలు భావిస్తున్నారు. ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేని పనితీరు మరోసారి కలిసి వచ్చే ఛాన్స్ ఉంది. ఇటీవలే ఆమె కుటుంబంతో నారా కుటుంబం కూడా కలిసిపోయిన పరిస్థితులు బేరీజు వేసుకుని పురందేశ్వరికే మరికొంత కాలం పార్టీ బాధ్యతలు అప్పజెప్పాలని కేంద్ర బీజేపీలోని ఒక వర్గం భావిస్తోంది. ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న వ్యక్తుల్లో విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సత్యనారాయణ చౌదరి అలియాస్ సుజనాచౌదరి ఒకరు. 2019 ఎన్నికల్లో టిడిపి ఓటమి తర్వాత తప్పనిసరి పరిస్థితుల్లో బీజేపీలో చేరిన ఆయన అప్పటి నుంచి పార్టీకి నమ్మకంగా పని చేస్తూ వస్తున్నారు. ఆర్థికంగా సామాజికంగా బలమైన వ్యక్తి కావడంతోపాటు కేంద్ర స్థాయిలో పలుకుబడి కూడా గట్టిగానే ఉంది. 2024 ఎన్నికల్లో చాలా కీలకంగా వ్యవహరించిన ఆయనకు టిడిపి హైకమాండ్‌తో కూడా దగ్గర పరిచయాలు ఉన్నాయి. అంతేకాకుండా ఇటీవల వైసీపీలో నుంచి బయటికి వచ్చిన

ఒక కీలక నేత ఆ నిర్ణయం తీసుకునేలా చక్రం తిప్పింది సుజనా చౌదరే అని త్వరలోనే ఆ వ్యక్తి బిజెపిలో చేరతారని ఏపీ రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఈ ప్రచారంలో వాస్తవం ఎంత ఉన్నా సుజనా చౌదరికి బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి అప్పజెప్పినట్లయితే పార్టీని బలోపేతం చేసేలా కీలక వ్యక్తులను ప్రముఖులను పార్టీ వైపు ఆకర్షించేలా చేయగల సమర్థత సుజనా చౌదరికి ఉందని ఆయన వర్గం చెబుతూ వస్తోంది. సుజనా చౌదరి కూడా ఆ దిశగా తన ప్రయత్నాలు ముమ్మరం చేశారన్న సంకేతాలు అందుతున్నాయిబిజెపి ఈసారి రాయలసీమనేతకు రాష్ట్ర అధ్యక్ష పదవి కట్ట పెట్టాలంటే అది దక్కేది విష్ణువర్ధన్ రెడ్డికే. ఇప్పటికే ఆ దిశగా తన ప్రయత్నాలు తీవ్రతరం చేశారాయన. యువనేత కావడం ప్రత్యర్థులకు సీరియస్‌గా సమాధానం చెప్పడం పార్టీకి విధేయుడుగా ఉండడం ఇవన్నీ ఆయనకి కలిసి వచ్చే అంశాలు కాగా.. కాస్త దూకుడు స్వభావం చిక్కులు తెచ్చి పెడుతూ ఉంటుంది. కానీ ఎలాగైనా బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం తన వంతు ప్రయత్నం ఆయన ముమ్మరంగా చేస్తున్నారు బీజేపీ కేంద్ర నాయకత్వం వద్ద అత్యంత పలుకుబడి గల వ్యక్తి. కేంద్ర విధానాలపైన రాష్ట్ర సమస్యలపైన లోతైన అవగాహన ఉన్న వ్యక్తి ఈయనే. 2024 ఎన్నికలకు ముందే ఏపీకి షిఫ్ట్ అయిన జీవీఎల్ నరసింహరావు కొంతకాలం పాటు వైజాగ్‌కు మాత్రమే పరిమితం అయిపోయారు. ఇప్పుడు మారిన పరిణామాల దృష్ట్యా రాష్ట్ర రాజకీయాల్లో కీలక బాధ్యతలు నిర్వహించాలని భావిస్తున్నారు. పైపెచ్చు మొదటి నుంచి బిజేపీతోనూ సంఘ్ పరివార్‌తోనూ లోతైన సంబంధాలు కలిగి ఉన్న వ్యక్తిగా జివిఎల్ బిజెపి కేంద్ర నాయకత్వం దృష్టిలో గుడ్ లుక్స్‌లో ఉన్నారు. బిజెపి రాష్ట్రంలో కష్టకాలంలో ఉన్న సమయంలోనూ నిబద్ధతతో పనిచేసిన వ్యక్తిగా మాధవ్‌కు గుర్తింపు ఉంది. గతంలో విపక్షంలో ఉన్నప్పుడు ఎమ్మెల్సీగా ప్రజా సమస్యలపై మాట్లాడిన అనుభవం ఉంది. వివాదరహితుడు కావడంతోపాటు ఉత్తరాంధ్రకు చెందిన నాయకుడిగా ఉన్న పేరు అందరితో కలిసిపోయే మనస్తత్వం మాధవ్‌కు ప్లస్ పాయింట్స్. మంచివాడు సమర్థుడు అనే పేరు ఉన్నా మిగిలిన వారితో పోలిస్తే కేంద్ర నాయకత్వం దగ్గర రాష్ట్ర అధ్యక్షుడు పదవి కోసం ఆ స్థాయిలో లాబీయింగ్ చేయగలడా అనే దానిపై పదవి దక్కుతుందా లేదా అనేది ఆధారపడి ఉంటుంది. ప్రధానంగా ఏపీ బీజేపీ అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్న వ్యక్తులు వీరే. వీళ్ళే కాకుండా క్షత్రియ సామాజిక వర్గం నుంచి విష్ణుకుమార్ రాజు లాంటివాళ్ళు లైన్‌లోనే ఉన్నా ఇప్పటికే ఆ సామాజిక వర్గానికి కేంద్రమంత్రి పదవి ఇచ్చారు. కాబట్టి రాష్ట్ర అధ్యక్ష పదవి ఇస్తారా లేదా అనేది డౌటే. ఏదైనప్పటికీ గతంలో ఎన్నడూ లేనంతగా ఏపీ బీజేపీ అధ్యక్ష పదవి కోసం తీవ్రమైన పోటీ అయితే నెలకొని ఉంది. పైన చెప్పిన పేర్లలో ఒకరిని కేంద్ర అధినాయకత్వం గుర్తిస్తుందా లేక మరొక అనూహ్యమైన పేరును తెరపైకి తెస్తుందా అనేది చూడాలి.

# నాటకాల రాయుడికి చెక్...

**శ్రీకాకుళం, ఏప్రిల్ 24, పెన్ పవర్: 333.** వైసీపీకి చెందిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ను ఆ పార్టీ నాయకత్వం సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. పార్టీ నాయకత్వం దువ్వాడ శ్రీనివాస్ ను సస్పెండ్ చేస్తున్నట్లు వైసీపీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర కార్యాలయం నుంచి ఈ ఉత్తర్వులు రావడంతో జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారని అర్థమవుతుంది. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడినట్లు దువ్వాడపై వరసగా ఫిర్యాదులు రావడంతోనే శ్రీనివాస్ పై సస్పెన్షన్ వేటు వేసినట్లు ప్రకటనలో తెలిపింది. అయితే ఇది ఒక నాటకంగా ప్రత్యర్థి పార్టీలు చెబుతున్నాయి. ఎప్పుడో తీసుకోవాల్సిన నిర్ణయం ఇప్పుడు తీసుకోవడమేంటని ప్రశ్నిస్తున్నారు. పార్టీ నుంచి సస్పెండ్ చేయడమే కాకుండా ఎమ్మెల్సీ పదవి నుంచి కూడా దువ్వాడను తప్పిస్తేనే జనం నమ్ముతారంటున్నారు.. గతంలోనూ ఎమ్మెల్సీ అనంతబాబు విషయంలోనూ ఇదే జరిగిందన్న విషయాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య ఘటనలో నాడు అనంతబాబు జైలుకు వెళ్లారు. నిందితుడిగా చేర్చిన పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. దళిత వ్యక్తిని చంపడమే కాకుండా తన కారులోనే పార్శిల్ చేసి ఇంటికి తీసుకు వచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించిన వైనం అప్పట్లోనే సంచలనం కలిగించింది. అయితే అనంతబాబుపై పార్టీ పరంగా చర్యలు తీసుకున్న వైసీపీ అధినాయకత్వం ఎమ్మెల్సీ పదవి నుంచి మాత్రం వేటు వేయలేకపోయింది. అధికారంలో ఉన్నప్పుడు కూడా ఆ పనిచేయకపోవడంతో ఆ ఘటన పార్టీ ఓటమికి ఒక కారణంగా మారిందనే చెప్పాలి. ఇక దువ్వాడ శ్రీనివాస్ వ్యవహారం కొత్తగా జరగట్లేదు. గత కొన్ని నెలలుగా జరుగుతున్న తంతు ఇది. దాదాపు ఏడాది కాలం నుంచి ఈ డ్రామా నడుస్తుంది. దువ్వాడ శ్రీనివాస్ భార్య వాణి, ఇద్దరు కుమార్తెలు ఆయన ఇంటివద్ద ఆందోళనకు దిగారు. .దువ్వాడ శ్రీనివాస్ తో వాణి వివాహమయింది. వారికి ఇద్దరు కుమార్తెలున్నారు. అయితే గత కొంత కాలం నుంచి ఇద్దరూ విడిపోయి ఉంటున్నారు. దువ్వాడ శ్రీనివాస్ గత వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అంతకు ముందు శ్రీకాకుళం పార్లమెంటు సభ్యుడిగా పోటీ చేశారు. ఓటమి




పాలు కావడంతో ఆయనకు వైఎస్ జగన్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. తర్వాత 2024 ఎన్నికల్లో టెక్కలి సీటును కూడా దువ్వాడ శ్రీనివాస్ కే జగన్ కేటాయించారు. దీంతో పాటు మాధురి అనే మహిళతో బయట చక్కెర్లు కొడుతున్నారు. అయినా సరే ఇప్పటి వరకూ పార్టీ చర్యలు తీసుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. వైసీపీ అధికారం కోల్పోయిన తర్వాత దువ్వాడ శ్రీనివాస్ ఫ్యామిలీలో రచ్చ మొదలయింది. ఇది టెక్కలిలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా రచ్చ అయింది. పార్టీకి కూడా తలనొప్పిగా మారింది. ఒక ఎమ్మెల్సీగా ఉండి భార్యకు విడాకులు ఇవ్వకుండా దువ్వాడ శ్రీనివాస్ మరో మహిళతో సహజీవనం చేస్తున్నారని ఆయన భార్య వాణి ఆరోపిస్తున్నారు. ఆమె ట్రాప్ లో పడి తమను పూర్తిగా వదిలేశారంటున్నారు.

గత కొంతకాలంగా దువ్వాడ శ్రీనివాస్, మాధురి కలసి టూర్లు చేస్తున్నారు. అయినా పార్టీ పట్టించుకోలేదు. తిరుమలలోనూ ఫొటో షూట్ వివాదంగా మారింది. అయినా చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు తాజాగా ఆయనపై సస్పెన్షన్ వేట వేయడం డ్రామాగానే చూడాల్సివస్తుందని, పార్టీకి ఉత్తరాంధ్రలో జరుగుతున్న డ్యామేజీని కాపాడుకోవడానికే ఇప్పుడు సస్పెన్షన్ వేటు వేశారంటూ కామెంట్స్ సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. అందులో నిజం కూడా ఉంది కదా?

# ఏపీలో మండుతున్న సూరీడు

**కర్నూలు, ఏప్రిల్ 24, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు దంచికొడుతున్నాయి. రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వాతావరణం నిప్పుల కుంపటిని తలపిస్తోంది. ఈ సీజన్‌లో ఎన్నడూ లేని స్థాయిలో నంద్యాల జిల్లాలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రత నమోదైంది. గురువారం నంద్యాల జిల్లా గోనవరంలో 44 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అత్యధికమని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. వైఎస్సార్ జిల్లాలో 28, నంద్యాల 22, ప్రకాశం జిల్లాలో 17, పల్నాడు 14, కర్నూలు జిల్లాలోని పదిచోట్ల 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా 135 ప్రాంతాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. గురువారం ఆంధ్రప్రదేశ్‌లోని 30 మండలాల్లో తీవ్రవడగాలులు, 29 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ఉష్ణోగ్రతలు పెరుగుతూ ఉండటం, ఎండవేడిమి నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ సూచించారు. ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలకు పైగా నమోదవుతున్న నేపథ్యంలో వైద్యులు పలు సూచనలు చేస్తున్నారు. రోజువారీ పనుల కోసం బయట తిరిగే వారు అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలు, తీవ్ర వడగాలుల నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. నిమ్మరసం, పండ్లరసాలు, మజ్జిగ, కొబ్బరినీళ్లు, ఓఆర్ఎస్ వంటివి



తీసుకోవాలని చెప్తున్నారు. వేసవి సీజన్‌లో దొరికే పుచ్చకాయ, కర్బూజా వంటి పండ్లతో పాటుగా కీరదోస, బత్తాయి, ద్రాక్ష, పైనాపిల్ ఎక్కువగా తీసుకోవాలని చెప్తున్నారు. వీటిలో నీటిశాతం అధికంగా ఉంటుందని.. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడతాయని వివరిస్తున్నారు. మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లడం మంచిది కాదని.. తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ వంటివి ధరించాలని సూచిస్తున్నారు. వడదెబ్బ ఎవరికి తగులుతుందంటే.. ఎండాకాలంలో వడదెబ్బ ఫలానా వయసు వారికే తగులుతుందని చెప్పడానికి వీలులేదు. ఎవరికైనా తగలవచ్చు. అయితే శిశువులు, చిన్నపిల్లలు, గర్భిణులతో పాటుగా వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారిపై ఎక్కువ ప్రభావం ఉంటుంది. సెలవుల సీజన్ కావటంతో శుభకార్యాలు, విహార యాత్రలకు ఎక్కువగా వెళ్తుంటారని, ఈ సమయాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తేలికపాటి ఆహారాన్ని తీసుకోవాలని.. వేపుళ్లు, జంక్‌ఫుడ్, మద్యం, మాంసాహారం తక్కువగా తీసుకుంటే మంచిదంటున్నారు. తీవ్రమైన తలనొప్పి, వికారం, వాంతులు, రక్తపోటులో తగ్గుదల వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

## పెరుగుతున్న బంగారం ధరతో...

# స్వర్ణకారుల అవస్థలు

**రాజమండ్రి , ఏప్రిల్ 24, పెన్ పవర్:** బంగారం ధర లక్ష రూపాయలు దాటేసింది. పది గ్రాముల పసిడి త్వరలో లక్షా పాతికకు వెళ్తుందని అంచనా. బంగారం ధర ఆకాశాన్నంటుండటంతో మధ్యతరగతి ప్రజలు బంగారు వైపు చూసేందుకు జంకుతున్నారు. ముఖ్యంగా బంగారు వస్తువులు చేయించుకోవడానికి గోల్డ్ స్మిత్ వర్కర్స్ దగ్గరికి రావడం మానేశారు. దీంతో ఉన్న వ్యాపారం పోయి గోల్డ్ స్మిత్ వర్కర్లు డీలాపడ్డారు. ప్రస్తుతం తమ పరిస్థితి దయనీయంగా ఉందంటున్నారు స్వర్ణకారులు. స్వర్ణకారులు సాధారణంగా బంగారం, వెండి తోపాటు ప్లాటినం వంటి లోహాలను ఉపయోగించి ఆభరణాలు, ఇతర అలంకరణ వస్తువులను డిజైన్ చేయడం, క్రాఫ్టింగ్ చేయడం, మరమ్మతు చేయడం, సవరించడం వంటి పనులను చేపడతారు. ఒక బంగారు వస్తువు తయారు చేయాలన్నా.. వస్తువు రీప్లేస్‌మెంట్ చేయాలన్న చాలా నిశిత దృష్టి అవసరం. అలాంటి స్వర్ణకారుడు ఇప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి మెయిన్ రోడ్ లో 700కి పైగా బంగారు షాపులు ఉన్నాయి. ఇందులో వందలాది మంది స్వర్ణకారులు పనులు చేసుకుంటున్నారు. తాజాగా పెరిగిన బంగారం ధరలతో బంగారం కొనుగోలు చేయలేక మధ్యతరగతి వారు కూడా కనీసం షాపులకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే మమ్మలను ఆదుకోవాలని కోరుతున్నారు. బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్నందున ప్రజలు బంగారు ఆభరణాలు తయారు చేయడానికి తమ వద్దకు రాక పనులు లేక స్వర్ణకారులు షాపులు వెలవెలబోతున్నాయి. స్వర్ణకారుల షాపుల వద్ద పనులు లేక కొన్ని షాపులు మూసేస్తే మరికొన్ని షాపుల వద్ద ఖాళీగా పనిలేక నిరాశతో ఉన్నారు. బంగారు ధరల పెరుగుదలను పరిగణనలోకి తీసుకుంటే ప్రజలు మునుపటి కంటే తక్కువ బంగారాన్ని కొనుగోలు చేస్తున్నారు. తత్ఫలితంగా, స్వర్ణకారులు ప్రతికూలంగా ప్రభావితమవుతున్నాయి అంటున్నారు. చాలా మంది చేతి వృత్తులవారి జీవితాలు ఇబ్బందుల్లో పడ్డాయని, ఎన్నో ఏళ్ల అనుభవం ఉన్న సీనియర్ స్వర్ణకారులు విచారం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకుల్లో స్వర్ణకారులకు లోన్లు రాక.. ఇటు పనులు లేక కొంతమంది ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారని వాపోతున్నారు. బంగారం ధర పెరుగుదలతోపాటు.. పెద్ద పెద్ద లగ్జరీష్ బంగారం షాపులు వచ్చేయడంతో పనులు బాగా తగ్గిపోయిని వాపోతున్నారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుని ఏదైనా భృతి ప్రకటించాలని కోరుతున్నారు రాజమండ్రి స్వర్ణకారులు. తూర్పుగోదావరి జిల్లాలో ఒక రాజమండ్రిలోనే వెయ్యి మందికి పైగా స్వర్ణకారులు ఈ సాంప్రదాయ వృత్తిపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. ఇక చుట్టుపక్కల స్వర్ణకారులైతే మరొక 3,000 నుంచి 4,000 మంది వరకు ఉంటారు. పూర్వపు ఉమ్మడి గోదావరి జిల్లాలో దాదాపు వేలాది మంది స్వర్ణకారులు పరిస్థితి ఇలాగే ఉందని అంటున్నారు. ఆభరణాల తయారీలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం రావడంతో ఈ వృత్తికి ప్రాధాన్యత తగ్గడం.. మరోవైపు బంగారు ఆభరణాలు రేటు అధికమవడం.. వెరసి సామాన్య స్వర్ణకారుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు.

# ఏప్రిల్ 28న విశాఖ మేయర్ ఎన్నిక

**విశాఖపట్టణం, ఏప్రిల్ 24, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. అధికారం కోల్పోయిన తర్వాత పలువురు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు వైసీపీని వీడుతున్న సంగతి తెలిసిందే. వైసీపీ నుంచి కూటమి పార్టీల్లోకి జంప్ అవుతూ ఉండటంతో ఇప్పటికే పలు కార్పొరేషన్లను, మున్సిపాలిటీలను వైసీపీ కోల్పోయింది. తాజాగా శ్రీసత్యసాయి జిల్లాలో వైసీపీకి షాక్ తగిలింది. సత్యసాయి జిల్లా కదిరి మున్సిపాలిటీ వైసీపీ చేజారింది. కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ నజీమున్నిసాపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో కదిరి మున్సిపాలిటీని కూడా వైసీపీ కోల్పోయింది. కదిరి మున్సిపల్ ఛైర్ పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీనికి 25మంది కౌన్సిలర్లు హాజరు కాగా.. ఛైర్ పర్సన్‌తో పాటు వైసీపీ 11మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. కోరం ఉండటం... హాజరైన మొత్తం 25మంది అవిశ్వాసానికి మద్దతివ్వడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గింది. అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో కదిరి మున్సిపల్ ఆఫీసు వద్ద పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. మరోవైపు కదిరి మున్సిపాలిటీ అవిశ్వాస తీర్మానం నెగ్గటంతో టీడీపీ శ్రేణులు టపాసులు పేలుస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్.. ప్రజాస్వామ్యయుతంగానే అవిశ్వాసం జరిగిందన్నారు. కదిరి మున్సిపల్ ఛైర్ పర్సన్ నజీమున్నిసా అవినీతికి పాల్పడ్డారని.. కదిరిలో అభివృద్ధి లేదని ఆరోపించారు. అందుకే వైసీపీ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టారన్న కందికుంట వెంకటప్రసాద్.. కదిరి అభివృద్ధి కోసమే అవిశ్వాసం పెట్టినట్లు తెలిపారు. త్వరలో అందరికీ ఆమోదకరంగా ఉండేలా మున్సిపల్ ఛైర్ పర్సన్, వైస్ ఛైర్మన్‌ను ఎన్నుకుంటామని వెల్లడించారు. మరోవైపు విశాఖపట్నం మేయర్ పీఠం వైసీపీ చేజారిన సంగతి తెలిసిందే. విశాఖ మేయర్ గొలగాని హరి వెంకట కుమారిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం ఇటీవల నెగ్గింది. దీంతో హరి వెంకట కుమారిని మేయర్ పదవి నుంచి తొలగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే ఈ ఆదేశాలు అమలులోకి వస్తాయని అందులో పేర్కొంది. విశాఖ మేయర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానానికి 2/3 వంతు సభ్యులు అనుకూలంగా ఓటు వేయటంతో తీర్మానం నెగ్గింది. 110 మంది సభ్యుల్లో 74 మంది తీర్మానానికి మద్దతుగా ఓటేశారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గగా.. విశాఖ మేయర్ పదవి నుంచి హరి వెంకట కుమారిని తొలగిస్తూ ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. మరోవైపు విశాఖ మేయర్ పదవికి ఏప్రిల్ 28న ఎన్నిక నిర్వహించనున్నారు.

# అలా అయితే ఎలా.. తమ్ముళ్ల ఆవేదన

**విజయవాడ, ఏప్రిల్ 24, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై పార్టీ నేతలతో పాటు క్యాడర్ కూడా ఒకింత అసహనంతో ఉన్నారు. కూటమి ద్వారా అధికారంలోకి వచ్చినప్పటికీ రాజ్యసభ స్థానాల విషయంలో తలవొగ్గి ఉండటం ఎందుకన్న ప్రశ్న తలెత్తుతుంది. రాజ్యసభకు టీడీపీలో తక్కువ స్థానాలు ఉన్నప్పటికీ ఖాళీ అయ్యే ప్రతి స్థానం కమలం ఖాతాలో పడిపోతే ఇక మనకు వచ్చేది ఎప్పుడంటూ నేతలు ప్రశ్నిస్తున్నారు. సోషల్ మీడియాలోనూ క్యాడర్ ఇదే రకమైన ప్రశ్నలు వేస్తున్నారు. గత ఎన్నికల్లో కూటమి ఏర్పాటయినందున అనేక మంది తమ స్థానాలను త్యాగం చేశారు. అదేసమయంలో చాలా మంది సీనియర్లను పోటీకి దూరంగా పెట్టారు. అయితే వారి సేవలను వినియోగించుకుంటామని చెప్పడంతో ఎక్కువ మంది రాజ్యసభ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. టీడీపీలో చాలా మంది సీనియర్ నేతలు గత ఎన్నికల్లో టిక్కెట్లు దక్కకపోయినా కూటమి విజయం కోసం పనిచేశారు. తమకు సుదీర్ఘకాలంగా ఉన్న పరిచయాలను కూటమి అభ్యర్థుల గెలుపుకోసం ప్రయత్నించారు. అంతే కాదు.. నియోజకవర్గంలో తమ పట్టు కోల్పోతామని తెలిసినా పార్టీ కోసం వారు కష్టపడి పనిచేశారు. అనేక మంది కొత్త వారికి, యువకులకు అవకాశం ఇవ్వడంతో సీనియర్ నేతలకు టిక్కెట్లు దొరక్కుండా పోయాయి. అయినా అసంతృప్తి లోపల ఉన్నా ఎక్కడా బయటపడకుండా క్యాడర్ కు సర్దిచెప్పి ఎన్నికల్లో విజయం కోసం పాటుపడ్డారు. టీడీపీ అధికారంలోకి వస్తే తమకు నామినేటెడ్ పదవులు వస్తాయని వారు నమ్మకం పెట్టుకున్నారు. అందుకే గత ఎన్నికల్లో కష్టపడి పనిచేశారు. గతంలో వైసీపీకి చెందిన ముగ్గురు రాజ్యసభ సభ్యులు రాజీనామా చేసినా అందులో రెండింటిలో మాత్రమే టీడీపీ నిలబెట్టింది. రెండింటిలోనూ ఒకటి రాజీనామా చేసి వచ్చిన బీద రవిచంద్ర యాదవ్ కు తిరిగి పదవి ఇచ్చింది. అలాగే మరో రాజ్యసభ పదవి యువకుడైన సానా సతీష్ కు ఇచ్చారు. దీంతో నాడు కూడా సీనియర్ నేతలు పెట్టుకున్న ఆశలు అడియాసలు అయ్యాయి. పార్టీ అధికారంలో లేనప్పుడు తాము కష్టించి పనిచేసినా తమ కష్టాన్ని పార్టీ నాయకత్వం గుర్తించలేదన్న అసహనం కొందరు వ్యక్తంచేశారు. పెద్దల సభలో పార్టీ బలాన్ని పెంచుకోవాల్సిన సమయంలో ఇలా ఒత్తిడులకు తలొగ్గి బీజేపీకి అన్నిస్థానాలను కట్టబెట్టడమేంటన్న ప్రశ్న తలెత్తుతుంది. కేవలం అమరావతి, పోలవరం నిర్మాణం కోసం పదవులను పణంగా పెట్టడం ఎంత వరకూ సబబని కొందరు సూటిగానే ప్రశ్నిస్తున్నారు. బీజేపీకి ఏపీలో ఉన్న బలం తక్కువేనని తెలిసినా అది అడిగిన వెంటనే ఒప్పుకుని సొంత పార్టీ నేతలను రాజకీయంగా దూరం పెట్టేందుకు పార్టీ అగ్రనాయకత్వం చేస్తున్న పనిని పలువురు తప్పుపడుతున్నారు. ఏపీనుంచి కాకుండా తమిళనాడుకు చెందినవారికి రాజ్యసభ పదవి ఇస్తే ఏ రకమైన సంకేతాలు వెళతాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మన అవసరం వాళ్లకు ఉందని, దానిని ఆలోచించి పదవుల విషయంలో త్యాగరాజులు కావద్దన్నసూచనలు వెలువడుతున్నాయి.

### ఆర్సీబీ చేసినట్టు చేస్తే మనం ప్లే ఆఫ్స్‌కు చేరొచ్చు..

# సన్ రైజర్స్‌కు హెడ్ కోచ్ సలహా



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ కథ దాదాపుగా ముగిసింది. బుధవారం (ఏప్రిల్ 23) ముంబై ఇండియన్స్ చేతిలో ఘోరంగా ఓడిపోవడంతో ప్లే ఆఫ్స్ అవకాశాలు దాదాపుగా పోయినట్టే. కమ్మిన్స్ సేన ప్లే ఆఫ్స్ కు చేరాలంటే ఇకపై అద్భుతంగా జరగాల్సిందే. ఇప్పటివరకు ఆడిన 8 మ్యాచ్ ల్లో రెండు మాత్రమే గెలిచిన సన్ రైజర్స్.. మిగిలిన ఆరు మ్యాచ్ ల్లో విజయం తప్పనిసరి. అంతేకాదు నెట్ రన్ రేట్ బాగా పడిపోవడంతో ఇకపై ప్రతి జట్టును భారీగా ఓడించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఉన్న కాంపిటీషన్ లో ఇలా జరగడం దాదాపు అసాధ్యం. అయితే ప్లే ఆఫ్స్ కు వెళ్లాలంటే సన్ రైజర్స్ హెడ్ కోచ్ డానియల్ వెటోరి ఒక సలహా ఇచ్చాడు. సన్ రైజర్స్ జట్టుతో పాటు ఫ్యాన్స్ దాదాపుగా ఆశలు వదిలేసుకున్నప్పటికీ వెటోరి మాత్రం తమ జట్టు ప్లే ఆఫ్స్ కు వెళ్తుందని ధీమా వ్యక్తం చేశాడు. ఈ సీజన్ లో పాయింట్ల పట్టికలో టాప్ 4 లో నిలిచే అవకాశం ఉందని తెలిపాడు. సన్ రైజర్స్ ఆశలు వదులుకోవాల్సి అవసరం లేదని జట్టులో ఆత్మ విశ్వాసం నింపే ప్రయత్నం చేస్తున్నాడు. వెటోరి మాట్లాడుతూ.. " గత సీజన్ లో RCB అద్భుతంగా ఆడింది. ప్లే ఆఫ్స్ నుంచి నిష్క్రమించిందనుకున్న తరుణంలో వరుసగా గెలిచి ప్లే ఆఫ్స్ కు అర్హత సాధించింది. ఆ జట్టు నుంచి మనం కొంత ప్రేరణ పొందితే ప్లే ఆఫ్స్ కు వెళ్లొచ్చు". అని ముంబై ఇండియన్స్ తో మ్యాచ్ ఓడిపోయిన తర్వాత విలేకరుల సమావేశంలో వెట్టోరి అన్నారు. గత సీజన్‌లో తొలి 7 మ్యాచ్ ల్లో ఒకటే మ్యాచ్ గెలిచిన ఆర్సీబీ ఆ ఆతర్వాత తమ చివరి 6 లీగ్ మ్యాచ్ ల్లో విజయం సాధించి 14 పాయింట్లతో ప్లే ఆఫ్స్ కు చేరుకున్నారు. సన్ రైజర్స్ తమ తదుపరి మ్యాచ్ శనివారం (ఏప్రిల్ 24) చెన్నై సూపర్ కింగ్స్ తో ఆడనుంది. రెండు జట్లకు ఈ మ్యాచ్ డూ ఆర్ డై. గెలిచిన జట్టు మాత్రమే టోర్నీలో నిలుస్తుంది. ఓడిపోతే మెగా టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. గత సీజన్ లో ఫైనల్ కు వెళ్లి రన్నరప్ గా నిలిచిన కమ్మిన్స్ సేన.. ఈ సీజన్ లో గాడిలో పడతారో లేదో చూడాలి.

# పాకిస్తాన్ తో క్రికెట్ మ్యాచులు అన్నీ రద్దు : ఎక్కడా కూడా ఆడేది లేదు




**హైదరాబాద్ పెన్ పవర్:** పహల్గాంలో ఉగ్రవాదుల నరమేధం తర్వాత.. బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకున్నది. పాకిస్తాన్ తో ఇక నుంచి క్రికెట్ మ్యాచులు ఆడేది లేదని స్పష్టం చేసింది. తటస్థ వేదికలపైన కూడా పాక్ తో మ్యాచ్ లు ఆడేది లేదని.. ఇది ఫైనల్ అని తేల్చి చెప్పింది బీసీసీఐ. అది వరల్డ్ కప్ అయినా.. ఇంకే సిరీస్ అయినా.. పాకిస్తాన్ తో ఫేస్ టూ ఫేస్ క్రికెట్ మ్యాచ్ ఇక ఉండదు.. ఉండబోదు అని స్పష్టం భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు.. బీసీసీఐ. ప్రస్తుతం పాక్ తో.. ఇండియా ఇతర దేశాల్లో ఆడుతుంది.. ఇక నుంచి అలాంటి వేదికపై కూడా ఆడేది లేదని.. ఇందులో రాజీ పడేది లేదని కూడా వెల్లడించింది బీసీసీఐ. భారత్ చివరిసారిగా 2008లో పాకిస్తాన్ దేశం వెళ్లి.. అక్కడ మ్యాచ్ లు ఆడింది. ఆ తర్వాత రెండు దేశాలు ఫేస్ టూ ఫేస్ ఆడలేదు. ఐసీసీ వరల్డ్ కప్ లాంటి మ్యాచుల్లోనూ.. ఇతర దేశాల్లో ఆడుతూ వచ్చింది. ఇక నుంచి పాకిస్తాన్ తో ఎలాంటి మ్యాచులు ఆడకూడదని బీసీసీఐ నిర్ణయించింది. ఐసీసీ నిర్వహించే సిరీస్ ల విషయంలో ఆడాలా వద్దా అనేది.. భారత ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా ఉంటుందని.. ప్రభుత్వం అనుమతి ఇస్తే అప్పుడు ఆలోచిస్తామని అంటోంది బీసీసీఐ. పాకిస్తాన్ ఎలాంటి దేశమో ఐసీసీకి కూడా తెలుసు అని స్పష్టం చేస్తోంది బీసీసీఐ. ఐసీసీ సిరీస్ విషయంలో ఆయా సందర్భాన్ని బట్టి.. ప్రభుత్వ నిర్ణయం ఆధారంగా పాకిస్తాన్ తో క్రికెట్ మ్యాచ్ ఆడాలా వద్దా అనేది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది బీసీసీఐ.

# సచిన్ తనయుడ్ని మా అబ్బాయి యువీ వద్దకు పంపండి... 3 నెలల్లో ఏ రేంజికి వెళతాడో చూసుకోండి

- కెరీర్ పరంగా ఇంకా వెనుకబడే ఉన్న సచిన్ అనయుడు అర్జున్ టెండూల్కర్
- ఇప్పటికీ ఉనికి కోసం పోరాడాల్సిన పరిస్థితి!
- యువీ శిక్షణలో అర్జున్ మరో క్రిస్ గేల్ అవుతాడన్న యోగరాజ్ సింగ్
- గతంలో అర్జున్ కు తాను శిక్షణ ఇచ్చానని గుర్తుచేసిన యువీ తండ్రి
- ఆ తర్వాత మొదటి రంజీలోనే అర్జున్ సెంచరీ కొట్టాడని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ క్రికెట్ భవిష్యత్తుపై భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ తండ్రి, కోచ్ యోగరాజ్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అర్జున్ తన బ్యాటింగ్ పై మరింత దృష్టి సారిస్తే, విధ్వంసకర బ్యాటర్ క్రిస్ గేల్ 2.0 స్థాయికి చేరుకోగలడని ఆయన అభిప్రాయపడ్డారు. సరైన శిక్షణ, మార్గనిర్దేశకత్వంతో అర్జున్ లోని బ్యాటింగ్ సామర్థ్యం వెలుగులోకి వస్తుందని సూచించారు. అర్జున్ టెండూల్కర్ బౌలింగ్ కన్నా బ్యాటింగ్ పై ఎక్కువ ఏకాగ్రత పెట్టాల్సిన అవసరం ఉందని యోగరాజ్ సింగ్ ఇటీవల 'క్రికెట్ నెక్స్ట్' కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. "అర్జున్ విషయంలో నేను చెప్పేది ఒక్కటే, బౌలింగ్ పై కాస్త తగ్గించి, బ్యాటింగ్ పై ఎక్కువ దృష్టి పెట్టాలి" అని ఆయన అన్నారు. సచిన్, యువరాజ్ ల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాన్ని ప్రస్తావిస్తూ, "యువరాజ్ గనుక సచిన్ కొడుకును తన ఆధ్వర్యంలోకి తీసుకుని ఓ మూడు నెలలు శిక్షణ ఇస్తే, అతను మరో క్రిస్ గేల్ అవుతాడని నేను పందెం కాయగలను" అని యోగరాజ్ ధీమా వ్యక్తం చేశారు. ఫాస్ట్ బౌలర్లు ఒత్తిడి సంబంధిత గాయాల (స్ట్రెస్ ఫ్రాక్చర్) బారిన పడితే, మునుపటి స్థాయిలో బౌలింగ్ చేయలేకపోవచ్చుని, అందుకే బ్యాటింగ్ పై దృష్టి పెట్టడం మేలని ఆయన పరోక్షంగా సూచించారు. "అర్జున్ ను కొంతకాలం యువరాజ్ కు అప్పగించాలని నేను భావిస్తున్నాను" అని యోగరాజ్ తెలిపారు. గతంలో అర్జున్ టెండూల్కర్, యోగరాజ్ సింగ్ వద్ద శిక్షణ తీసుకున్నాడు. 2022 రంజీ ట్రోఫీ సీజన్ కు ముందు అర్జున్, యోగరాజ్ వద్ద 12 రోజుల పాటు శిక్షణ పొందాడు. ఆ తర్వాత గోవా తరపున పోర్వోరిమ్‌లో తన రంజీ అరంగేట్ర మ్యాచ్ లోనే అద్భుత శతకాన్ని నమోదు చేశాడు. సరిగ్గా 1988లో సచిన్ టెండూల్కర్ కూడా తన రంజీ అరంగేట్రంలో శతకం బాదడం విశేషం. 'అన్ ఫిల్టర్డ్ బై సమదీష్' కార్యక్రమంలో యోగరాజ్ మాట్లాడుతూ, "సచిన్ కొడుకు నా దగ్గరకు 12 రోజులు వచ్చాడు, సెంచరీ కొట్టాడు. అరంగేట్రంలోనే సెంచరీ చేసి, ఐపీఎల్ కు తిరిగి వెళ్లాక, అతని (అర్జున్) పేరు నాతో ముడిపడిపోతుందేమోనని కొందరు భయపడ్డారు. అతడిని (అర్జున్ ను) ఒక ఏడాది పాటు నా దగ్గర వదిలిపెట్టి చూడమని సచిన్ కు సూచించమని నేను యువీకి చెప్పాను" అని యోగరాజ్ పేర్కొన్నారు.

### సుప్రీత నాయుడు చిత్రం-పర్ఫెక్ట్ మూమెంట్



# కుబేరా.. రిలీజ్ కు ముందే సేఫ్ జోన్ లో..



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, టాలీవుడ్ కింగ్ నాగార్జున కాంబినేషన్ లో కుబేరా మూవీ రూపొందుతున్న విషయం తెలిసిందే. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఆ మూవీ షూటింగ్ ఇప్పటికే కంప్లీట్ అయింది. ప్రస్తుతం మేకర్స్ పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుతున్నారు. ఇప్పటికే అనౌన్స్ చేసిన జూన్ 20న విడుదల చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నారు. అయితే పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా లాస్ట్ కు వచ్చినట్లు తెలుస్తోంది. ఎడిటింగ్ కంప్లీట్ అయ్యాక ఫైనల్ కాపీని మేకర్స్ సిద్ధం చేయనున్నారని సమాచారం. ఆ తర్వాత దేవి శ్రీ ప్రసాద్ రీ రికార్డింగ్ చేయనున్నారట. అదే సమయంలో సినిమాపై ఆడియన్స్ లో ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. సూపర్ హిట్ కచ్చితంగా అవుతుందని అంతా ఎక్స్పెక్ట్ చేస్తున్నారు. ఇప్పటి వరకు మేకర్స్ రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్.. పాజిటివ్ బజ్ క్రియేట్ చేసింది. రీసెంట్ గా మేకర్స్ విడుదల చేసిన పోయిరా మామ లిరికల్ సాంగ్ సోషల్ మీడియాలో దూసుకుపోతోంది. స్టార్టింగ్ లో కాస్త స్లోగా అనిపించినా.. ఇప్పుడు మెల్లగా ఎక్కేస్తోంది. మరిన్ని సాంగ్స్ ను త్వరలోనే మేకర్స్ రిలీజ్ చేయనున్నారు. అయితే మూవీ బడ్జెట్ అనుకున్న దానికన్నా ఎక్కువే అయినట్లు ఇప్పుడు టాక్ వినిపిస్తోంది. క్యాస్టింగ్ పారితోషికాలు, షూటింగ్ వ్యయాలు.. అలా వివిధ విషయాల్లో లెక్కలు చేంజ్ అయ్యాయని సమాచారం. మొత్తం కలిపి రూ.100 కోట్లు అయ్యి ఉండొచ్చని వినికిడి. కొద్ది రోజుల క్రితం ప్రీ రిలీజ్ బిజినెస్ స్టార్ట్ అయినట్లు తెలుస్తోంది. ఇప్పటికే బడ్జెట్ లో 30 శాతం వచ్చేసిందట. హిందీ డబ్బింగ్, డిజిటల్, ఓటీటీ, ఆడియో డీల్స్ నుంచి పెట్టుబడిలో మేకర్స్ 30 శాతం రాబట్టినట్లు తెలుస్తోంది. తెలుగు, తమిళ థియేట్రికల్ రైట్స్ డీల్స్ ఖరారు అవ్వలేదట. అయితే వాటికోసం పలు సంస్థలు పోటీ పడుతున్నాయని వినికిడి. ఏదేమైనా రిలీజ్ కు ముందే మూవీ.. సేఫ్ జోన్ లో ఉందని ప్రచారం జరుగుతోంది. పెట్టుబడి విషయంలో ఎలాంటి డోకా లేదని టాక్. ఇక మూవీ విషయానికొస్తే.. నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఫిమేల్ లీడ్ రోల్ లో కనిపించనున్నారు. ఇప్పటికే ఆమె లుక్స్ ను మేకర్స్ రివీల్ చేశారు. జిమ్ సెర్బ్, దలీప్ తహిల్ తదితరులు ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. అమిగోస్ క్రియేషన్స్ పై సునీల్ నారంగ్, పుష్కర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. మరి పాన్ ఇండియా లెవెల్ లో రిలీజ్ కానున్న కుబేరా ఎలా ఉంటుందో వేచి చూడాలి.

### ఆమె లేటెస్ట్ లుక్‌లో అనసూయను అభిమానులు పర్ఫెక్ట్ "బంగారీర్ చూరి" అని పిలుస్తారు



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com